



ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీ

అక్రమార్కుల్లో అలజడి..!

- కూటమి సర్కార్ కీలక నిర్ణయం
- జగనన్న కాలనీల్లో అనర్హుల ఏరివేతకు రంగం సిద్ధం
- 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశాలు
- పట్టాలు కొన్న వారిలో ఆందోళన

నంద్యాల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : వైసీపీ సర్కార్ గత ఐదేళ్ల పాలనలో జగనన్న కాలనీల పేరుతో చేసిన అక్రమాలను కూటమి సర్కార్ ఒక్కొక్కటిగా బయటకు తీస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా గత ప్రభుత్వ పాలనలో జగనన్న కాలనీల్లో అక్రమంగా పట్టాలు పొందిన అక్రమార్కుల ఏరివేతకు రంగం సిద్ధం చేసింది. ఆ దిశగా రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జయలక్ష్మి సైతం తాజాగా ఉత్తర్వులు జారీ చేయడం కలవరం రేపుతోంది. వీటికితోడు 15 రోజుల వ్యవధిలోనే క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి అనర్హుల జాబితాను గుర్తించి వెంటనే తగిన నివేదికను అందజేయాలని కలెక్టర్‌ను ఆదేశించడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని జగనన్న కాలనీల్లో పట్టాలు పొందిన లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. అక్రమంగా పొందిన వారిలో అలజడి మొదలైంది. మొత్తంగా జగనన్న కాలనీలో అనర్హుల ఏరివేతపై కూటమి సర్కారు సరికొత్త నిర్ణయం తీసుకున్నట్లయింది. అక్రమార్కుల్లో మాత్రం వణుకు మొదలైంది.





● జిల్లాలో పరిస్థితి ఇలా...

- జిల్లాలో జగనన్న కాలనీల సంఖ్య : 318
- లబ్ధిదారులకు ఇచ్చిన పట్టాల సంఖ్య : 47,814
- సదరు కాలనీల్లో ఇళ్ల మంజూరు సంఖ్య : 18,865
- పూర్తయిన ఇళ్ల సంఖ్య : 5309
- ఇప్పటికీ ఎలాంటి నిర్మాణం చేయని ఇళ్ల సంఖ్య : 4556
- వివిధ దశలలో ఉన్న ఇళ్ల సంఖ్య : 9000

ప్రధానంగా పరిశీలించే అంశాలు...

- లబ్ధిదారుడు రేషన్‌కార్డు కలిగి ఉండాలి
- గతంలో కుటుంబంలో ఇంటి పట్టా పొంది ఉండరాదు
- ఇన్‌కంట్యాక్స్ చెల్లిస్తుంటే కూడా రద్దు
- కారు ఉన్న కూడా రద్దు
- కుల ధ్రువీకరణ పత్రం ఉండాలి
- లబ్ధిదారుడికి ఇచ్చిన పట్టాను ఎవరికైనా విక్రయించినట్లు తెలితే రద్దు

● ఆదేశాలు జారీ చేశాం

తహసీల్దార్లకు తగిన ఆదేశాలను జారీ చేశాం. త్వరలోనే యాప్ ద్వారా క్షేత్ర స్థాయిలో పర్యటించి జగనన్న కాలనీల్లోని లబ్ధిదారుల ఇంటి పట్టాలను పరిశీలిస్తాం. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా పట్టా పొందినట్లు తేలితే వారిని అనర్హుల జాబితా కింద గుర్తించి ప్రభుత్వానికి నివేదిస్తాం. ఆ తర్వాత ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం. అర్హులకు ఎలాంటి అన్యాయం జరగదు.

- విశ్వనాథ్, ఆర్డీఓ



చాగలమర్రి మండలం మల్లెవేముల రహదారి, దస్తగిరి స్వామికి వెళ్లే రహదారిలోని జగనన్న కాలనీ



చేతులు మారిన వారి పరిస్థితి ఏంటో..!

కూటమి సర్కార్ తాజా నిర్ణయంతో జగనన్న కాలనీల్లో అక్రమంగా పట్టా పొందిన వారిలో అలజడి మొదలైంది. ఇదే క్రమంలో ఆయా కాలనీల్లో పట్టా పొంది కూడా నిర్మాణాలు చేయకుండా ఇప్పటికి ఖాళీగా ఉన్న లబ్ధిదారులు తమ స్థలాలను ఎక్కడ లాగేసుకుంటారోనని ఆందోళన చెందుతున్నారు. వివిధ కారణాలతో చాలా మంది నిర్మాణాలు చేయలేదు. ఈ నేపథ్యంలో వారి పరిస్థితి అగోమ్యగోచరంగా మారింది. అంతేగాకుండా చాలా ప్రాంతాల్లో ఇంటి పట్టాలు చేతులు మారినట్లు తెలుస్తోంది.

● ఇళ్ల పట్టాల్లోనే కాదు..

గత ఐదేళ్ల పాలనలో జగనన్న కాలనీల పేరుతో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. భూమి ఎంపిక పక్రియ నుంచి చదును చేయడం.. కాలనీల్లో రోడ్లు, విద్యుత్, నీరు తదితర పక్రియ వరకు భారీగా అవినీతి అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు లేకపోలేదు. ఇది చాలదన్నట్లు.. వైసీపీ అక్రమార్కులతోపాటు అర్హత లేకపోయినా చాలా మందికి ఇంటి పట్టాలు ఇచ్చారనే విమర్శలు కూడాఉన్నాయి. కొన్నిచోట్ల గతంలో పట్టాలు పొందినా వారికి కూడా జగనన్న కాలనీల్లో మరోమారు పట్టాలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా కొన్ని షరతులు ఉన్నప్పటికీ రాజకీయ నాయకుల సిఫార్సులతో పట్టాలు పొందారనే ప్రచారం ఉంది. ఏదేమైనా కూటమి సర్కారు తాజా నిర్ణయంతో అనర్హుల జాబితాను గుర్తిస్తే వాటిని రద్దు చేసి కొత్త వారికి అప్పగించే అవకాశం ఉంది.

● ఐదేళ్ల పాటు ఆర్భాటమే...

కాలనీలు కాదు.. ఏకంగా జగనన్న కాలనీల పేరుతో ఊర్లకు ఊర్లనే నిర్మిస్తామని గత వైసీపీ సర్కారు గత ఐదేళ్ల పాటు ఊదరగొట్టింది. కానీ ఆచరణలో పెట్టలేక విఫలమైంది. ఆయా లబ్ధిదారులతోపాటు ప్రజల నుంచి విమర్శలు మూటకట్టుకుంది. అధికార లెక్కల ప్రకారం.. జిల్లాలో 318 జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి 47,814 ఇంటి పట్టాలను అందజేసి 18,865 ఇళ్లను ఆయా కాలనీల్లోని లబ్ధిదారులకు మంజూరు చేసింది. కానీ ఆశించిన స్థాయిలో ఎక్కడా నిర్మాణాలు సాగలేదు. ఐదేళ్ల పాలనలో మంజూరు చేసిన 18,865 ఇళ్లలో 5309 పూర్తి కాగా.. వివిధ దశలలో 9000 వేలు ఇల్లులు ఉండగా.. ఇప్పటికి 4556 ఇళ్ల ఎలాంటి నిర్మాణానికి నోచుకోకుండా పునాదుల్లోనే దర్శనమిస్తుండటం గమనార్హం. వీటి పరిస్థితి ఇలా.. ఉంటే సదరు కాలనీల్లో అర్హత లేకపోయిన ఇంటి పట్టాలు కట్టబెట్టారనే ఆరోపణలు లేకపోలేదు. ఇళ్ల నిర్మాణాల పరంగా చెప్పాలంటే.. వైసీపీ సర్కారు జగనన్న ఇళ్ల పేరుతో అంత ఆర్భాటమే చేసిందనే స్పష్టమైంది. ఇందుకు అధికార లెక్కలే అద్దంపడుతుండటం గమనార్హం.

● 15 రోజుల్లోనే నివేదిక...

ఎక్కడ అవకతవకలకు తావులేకుండా ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. సదరు యాప్ ద్వారా ఉత్తర్వులు ప్రకారం.. మండల ఆర్ఐ, సర్వేయర్, వీఆర్వో, తదితర సిబ్బందితో కూడిన బృందం ప్రతి రోజూ క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన సమగ్ర సమాచారాన్ని సదరు యాప్‌లో నమోదు చేయనున్నారు. ఇదే క్రమంలో ఆయా లబ్ధిదారులు తమకు సంబంధించిన అన్ని వివరాలతో పాటు ధ్రువపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలి. లేకుంటే మాత్రం అనర్హత పేరుతో ప్రభుత్వ ఆయా లబ్ధిదారుల పట్టాను రద్దు చేయనుంది. ఇదిలా ఉండగా.. ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లి, పాణ్యం, నంద్యాల నియోజకవర్గాల్లో ఆశించిన స్థాయిలో ఎక్కడా కూడా నిర్మాణాలు జరగలేదు. ఈ నేపథ్యంలో ఇంటి పట్టా ఇచ్చిన తరువాత కూడా ఏళ్ల తరబడి నిర్మాణం చేయకపోవడంతో వారికి అన్ని ఆధారాలు ఉన్నా తాజా ఉత్తర్వులతో తమకు ఇంటి పట్టా ఉంటుందా...? లేకపోతే రద్దు చేస్తారా..? లనే సందేహాలు బాధిత వర్గాల్లో నెలకొంది. మొత్తంగా జిల్లాలో 15 రోజుల్లో అధికార యంత్రాంగం లోతుగా విచారణ చేసి అనర్హుల జాబితా అందజేయాల్సి ఉంది.



బండి ఆత్మకూరు మండలం పెద్దదేవలాపురంలోని జగనన్న కాలనీ



పీజీఆర్ఎస్‌లో మహిళల సమస్యలను వింటున్న కలెక్టర్ రాజకుమారి (ఫైల్)

12వ స్థానంలో నంద్యాల

రాష్ట్ర స్థాయిలో నంద్యాల జిల్లాకు దక్కిన చోటు

ఇక్కడి నుంచి సీఎం చెంతకు చేరిన వినతులు 405

నంద్యాల, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి రాగానే ప్రజల సమస్య పరిష్కారానికి పెద్దపీట వేసింది. ఎక్కడికక్కడ సమస్యల పరిష్కారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీంతో ప్రజలు కూడా తమ సమస్యలపై ఎంతో ధైర్యంగా వినతులు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల కిందట ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతిలోని సచివాలయంలో నిర్వహించిన ప్రభుత్వ శాఖల కార్యదర్శులతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)పై సమీక్షించి పలు అంశాలను వెల్లడించారు. ఎక్కడిక్కడ సమస్యలను వేగవంతంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని దిశ నిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలు తమ సమస్యలపై అందించిన వినతుల జాబితా పరంగా పరిశీలిస్తే నంద్యాల జిల్లా 12వ స్థానంలో నిలిచింది. అదేవిధంగా సీఎం కార్యాలయానికి జిల్లా నుంచి వెళ్లిన వినతుల పరంగా చూస్తే 19వ స్థానంలో ఉంది.

● మొత్తంగా 27,510 వినతులు

గత సర్కారు ఐదేళ్ల పాలనలో జరిగిన అన్యాయాలపై ప్రజలు ఫిర్యాదులు చేయడం మొదలెట్టారు. దీంతో ఎక్కడికక్కడ ప్రజల వినతుల జాబితా పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాల వారిగా ఆరా తీయగా.. జిల్లా స్థాయిల్లో నిర్వహించిన గ్రీవెన్సుతో పాటు రెవెన్యూ సదస్సుల పరంగా మొత్తంగా 27,510 వినతులు రావడంతో రాష్ట్ర స్థాయిలో నంద్యాల జిల్లా 12వ స్థానంలో నిలిచింది. సీఎం వద్దకు చేరిన 405 వినతులతో రాష్ట్ర స్థాయిలో జిల్లా 19వ స్థానంలో నిలిచింది. అయితే వీటిలో ఎక్కువగా రెవెన్యూ సమస్యల వినతులు ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. ఇదిలాఉండగా.. రాష్ట్రంలో మొదటి, రెండో స్థానంలో శ్రీకాకుళం, పార్వతీపురం(మణ్యం).. చివరి స్థానంలో పల్నాడు జిల్లా ఉంది.




ఎన్ఆర్ పేటలో పది కోళ్లు మృతి

రెడ్ జోన్‌గా ప్రకటించిన అధికారులు

కలెక్టర్ అత్యవసర సమావేశం

కర్నూలులో బర్డ్ ఫ్లూ

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల కిందట కర్నూలు జిల్లాలో బర్డ్ ఫ్లూ ఆనవాళ్లు లేవని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని పశుసంవర్ధకశాఖ అధికారులు ప్రకటించారు. అయితే.. చాపకింద నీరులా బర్డ్ ఫ్లూ కర్నూలు నగరంలో వ్యాపిస్తోందని గురువారం బయట పడింది. దీంతో నగరంలో కలకలం రేగింది. కర్నూలు నగరంలోని ఎన్ఆర్‌పేటలో పది కోళ్లు మృతి చెందినట్లు పశుసంవర్ధకశాఖ అధికారులు గుర్తించారు. మృతి చెందిన ఒక కోడి శాంపుల్స్‌ను ల్యాబ్‌లో నిర్ధారణ కోసం పంపించగా.. పాజిటివ్ రావడంతో వెంటనే ఎన్ఆర్ పేటలో రెడ్‌జోన్‌గా ప్రకటించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. మృతి చెందిన 9 కోళ్లను బయటి ప్రదేశాలకు తరలించి గుంత తీసి పూడ్చినట్లు పశుసంవర్ధకశాఖ జేడీ శ్రీనివాస్ రాత్రి 8 గంటల సమయంలో తెలియజేశారు. కలెక్టర్‌కు ముందస్తు సమాచారం అందించడంతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఎన్ఆర్ పేటకు ఒక కిలోమీటరు పరిధిలో రెడ్ జోన్ హెచ్చరికలు అమలులో ఉంటాయని, కోళ్లను, గుడ్లను వ్యాపారుల అమ్మకుండా నిషేధం విధించాలని కలెక్టర్ రంజిత్ బాషా పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. పది కిలోమీటర్ల పరిధిలో శుక్రవారం నుంచి మొదలు పెట్టి సర్వే పరిస్థితులను సమీక్షించాలని ఆదేశాలు జారీ చేసినట్లు జేడీ తెలిపారు. శుక్రవారం ఎన్ఆర్ పేట కాలనీల్లో తమ అధికారులు, సిబ్బంది కోళ్ల దుకాణాలను పర్యవేక్షిస్తారని బర్డ్ ఫ్లూ తీవ్రతపై పరీక్షలు నిర్వహిస్తారని జేడీ తెలిపారు. పంచలింగాలతో పాటు ఆదోనిలో నాలుగు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, బయటి ప్రాంతం నుంచి కోళ్లు రాకుండా చర్యలు చేపట్టినట్లు జేడీ శ్రీనివాస్ తెలిపారు.



వేతన వ్యథలు

- ఉపాధి కూలీలకు ఆరు వారాలుగా అందని కూలి
- జిల్లాలో రూ.22 కోట్ల బకాయి
- బతుకు పోరులో వలసబాటన కూలీలు

కోడుమూరు మండలం ఎర్రదొడ్డి గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కర్నూలు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సీజన్ ముగిసింది. సొంతూళ్లలో పనులు లేవు. ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టినా రోజంతా మట్టిలో స్వేదం చిందిస్తే రూ.250-300లకు మించి కూలీ గిట్టుబాటు కావడం లేదు. ఆ డబ్బయినా ప్రతీవారం ఇస్తున్నారా..? అంటే అదీలేదు. ఐదారు వారాలుగా బకాయి ఉంటోంది. ఎన్నాళ్లు పస్తులతో పనులు చేసేది..? అంగడికి వెళితే అరువు పుట్టదు.. ఉపాధి పనులకెళ్తే వేతనాలు వెంటనే అందని పరిస్థితి. ఇక చేసేదేమీ లేక వలస శర్యణం..! అంటూ వలస బండెక్కి పోలోమని సాగిపోతున్నారు. కర్నూలు జిల్లాలో ఉపాధి వేతనాలు రూ.22 కోట్లు బకాయి చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బులు ఎప్పుడిస్తారో..? చెప్పలేని స్థితిలో అధికారులు ఉండిపోతున్నారు. మెటీరియల్ కాంపోనెట్ బకాయిలు సైతం రూ.40 కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ఉపాధి కూలీల ఆకలి తీర్చాలని పలువురు కోరుతున్నారు.

కర్నూలు జిల్లాలో 3.32 లక్షల జాబ్ కార్డులు జారీ చేశారు. అందులో పనులకు హాజరయ్యే యాక్టీవ్ జాబ్ కార్డులు 2.63 లక్షలు వరకు ఉన్నాయని డ్వామా రికార్డుల ద్వారా తెలుస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 70 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యం. కొత్త, పాత కలిపి 54 వేల పనులు గుర్తించారు. 10,305 పనులు పూర్తి చేయగా.. 44 వేల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 2024 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సోమవారం వరకు రూ.303.44 కోట్లు ఖర్చు చేశారు. అందులో కూలీల వేతనాలు (లేబర్ బడ్జెట్) రూ.213.55 కోట్లు కాగా.. మెటీరియల్ కాంపోనెంట్ రూ.73.04 కోట్లు ఖర్చు చేసినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. మరో నెలన్నరలో ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. అయినా ఆరు వారాలుగా ఉపాధి కూలి డబ్బులు అందడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● రూ.22 కోట్లు బకాయి

ప్రస్తుతం 55-60 వేల మందికి మించి ఉపాధి పనులకు రావడం లేదని తెలుస్తోంది. ప్రధాన కారణం రోజంతా కష్టపడితే సగటున రూ.250-288లకు మించి కూలిడబ్బు పడడం లేదు. ఆ డబ్బు కూడా ఆరు వారాలుగా బకాయి ఉంది. ఒక్కో కూలీకి సగటున రూ.8,500 నుంచి రూ.10 వేల వరకు చెల్లించాల్సి ఉందని సమాచారం. జిల్లాలో రూ.22 కోట్లకు పైగా బకాయి ఉంది. జనవరి 5వ తేది వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన కూలీలకు కూలి సొమ్ము వచ్చిందని అంటున్నారు. అంటే డిసెంబరు ఆఖరి వారం వరకు డబ్బులు వచ్చింది. జనవరి మొదటి వారం నుంచి ఈ రోజు వరకు అంటే ఆరు వారాలుగా ఉపాధి వేతనాలు అందక కూలీలు అవస్థలు పడుతున్నారు.

మిగతా 6లో...



హొళగుంద మండలం కోగిలతోట గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



శ్రీశైల పాదయాత్రికులకు

మెరుగైన సేవలు

- ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా

ఆత్మకూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాలినడకన తరలివచ్చే యాత్రికులకు అటవీశాఖ తరపున సౌకర్యవంతమైన సేవలు కల్పిస్తున్నట్లు ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీశైల పాదయాత్రికుల కోసం ఇప్పటికే నడక మార్గంలో జంగిల్ క్లియరెన్స్, ఫైర్‌లైన్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే దారి పొడవునా పల్లెకట్ట, పాతపెంట, నాగలూటి వీరభద్రాలయం, పంగిడి, దామర్లకుంట, పెచ్చెర్వు, వీరభద్ర తాపల రస్తా, మఠంబావి, భీమునికొలను, కైలాస ద్వారం, హఠకేశ్వరం ప్రదేశాల్లో దాతల సేవలకు సహకరించడంతోపాటు అటవీశాఖ తరపున సేవలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 17 నుంచి 15వ తేదీ వరకు పాదయాత్రికుల కోసం రాత్రిపగళ్లు తమ సిబ్బంది షిఫ్ట్‌ల వారిగా అందుబాటులోకి ఉంచారని వివరించారు. అదేవిధంగా పాదయాత్రికులు అదేవిధంగా ఆయా విడిది ప్రాంతాల్లో అటవీశాఖ తరుపున తాగునీరు సదుపాయం కల్పిస్తామని అన్నారు. అలాగే కమ్యూనికేషన్ కోసం వైర్‌లెస్ వాకీటాకీలను వినియోగించనున్నట్లు వివరించారు. నిర్దేశించిన పది ప్రాంతాల్లో వందకుగాపై తాత్కాలిక చెత్తకుండీలను ఏర్పాటు చేశామని, భక్తులు తమ వద్ద వ్యర్థాలను చెత్తకుండీల్లోనే వేసి సహకరించాలని కోరారు. కాగా శ్రీశైలానికి వచ్చే పాదయాత్రికులు ప్లాస్టిక్ కవర్లు, ఇతర హానికర వస్తువులను తీసుకురావద్దని సూచించారు. అదేవిధంగా వెంకటాపురం గ్రామం మీదుగానే అటవీ ప్రాంతంలోకి అనుమతిస్తామని, బైర్లూటి చెక్‌పోస్టు నుంచి నాగలూటికి పాదయాత్రికులకు అనుమతించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాల్లో 24గంటల పాటు శ్రీశైలానికి వాహనాలను అనుమతిస్తామని అన్నారు. పాదయాత్ర నేపథ్యంలో మొత్తం 25 మంది ఫారెస్టు ఉద్యోగులతోపాటు 40 మంది ప్రొటెక్షన్ వాచర్లు, మరో 70 మంది వలంటరీలు విధుల్లో పాల్గొంటారని వెల్లడించారు. పాదయాత్రికులు పర్యావరణహితంగా తమ యాత్రను పూర్తి చేసుకుని అటవీశాఖకు సహకరించాలని ఆకాంక్షించారు.

● **సున్నిపెంట:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అటవీ మార్గంలో కాలినడకన వచ్చే భక్తులకు ఈ ఏడాది అటవీ శాఖ ప్రతేక సౌకర్యాలు కల్పిస్తునట్లు సబ్ డీఎఫ్‌వో అబ్దుల్ రవూఫ్ తెలిపారు. గురువారం ఎఫ్‌డీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సబ్ డీఎఫ్‌వో అబ్దుల్ రవూఫ్, శ్రీశైలం రేంజర్ సుభాష్ మాట్లాడారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రకాశం జిల్లా దోర్నాల, శిఖరేశ్వరం వద్ద ఫారెస్టు చెక్ పోస్టులలో ఈ నెల 19 నుంచి మార్చి 1 వరకు నిరంతరం వాహనాలు రాకపోకలకు అనుమతిస్తున్నట్లు తెలిపారు. అటవీ మార్గంలో కూంబింగ్, పెట్రోలింగ్ నిరంతరం ఉంటుందని, శ్రీశైలం వచ్చే భక్తులు సహకరించాలని కోరారు.

అటవీ మార్గంలో దారి తప్పకుండా సూచిక బోర్డుల ఏర్పాటుతోపాటు పర్యావరణ పరిరక్షణ అంశాలు, జాగ్రత్తలను గుర్తు చేసేలా ప్రచార బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.


షిరిడీ సాయిబాబాకు పూజలు చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి


విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దంపతులు


భారీగా తరలివచ్చిన భక్తులు

కన్నుల పండువగా ఉత్సవం

● షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ
● భారీగా తరలివచ్చిన భక్తులు



డోన్ రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణ సమీపంలో నూతనంగా నిర్మించిన షిరిడీ సాయి బాబా మందిరంలో గురువారం షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. తెల్లవారు జాము నుంచి షిరిడీ సాయి మందిరంలో విశేష పూజ కార్యక్రమాలు జరిగాయి. షిరిడీ సాయిబా బాబా ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆయన సతీమణి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దంపతులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే టీడీపీ సీనియర్ నాయకుడు కేఈ ప్రతాప్, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. అంతకు ముందు షిరిడీ సాయిబాబా మందిరం కమిటీ సభ్యులు రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, కోట్ల దంపతులకు, టీడీపీ సీనియర్ నాయకుడు కేఈ ప్రతాప్, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబులకు కమిటీ సభ్యులు సోదారహంగా ఘన స్వాగతం పలికారు. షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. బాబాను దర్శించుకున్న భక్తులకు షిరిడీ సాయిబాబా మందిరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, షిరిడీ సాయిబాబా మందిరం కమిటీ సభ్యులు చాటకొండ శ్రీనివాసులు కొండా సురేష్, పార్థసారథి, ఆలా మల్లికార్జున రెడ్డి, శ్రీరాములు భక్తులు పాల్గొన్నారు.

● బందోబస్తు నిర్వహించిన పోలీసులు:

షిరిడీ సాయిబాబా ప్రాణప్రతిష్ఠ విగ్రహ కార్యక్రమానికి వచ్చిన భక్తులను దృష్టిలో ఉంచుకుని డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ సీఐ సీఎం రాకేష్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. షిరిడీ సాయిబాబా మందిరం ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

నలుగురికి ఐదేళ్ల జైలు శిక్ష

చాగలమర్రి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో నమోదైన ఓ కేసులో 149ఆఫ్ ఐపీసీ కింద ఐదుగురిపై నమోదైన కేసులోని ముద్దాయిలకు ఆళ్లగడ్డ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో గురువారం శిక్ష విధించినట్లు ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఈ కేసులో ఒకరు చనిపోగా నలుగురు ముద్దాయిలైన బాలయ్య, గడ్డ కిషోర్, లక్ష్మీదేవి, అశోక్‌లపై ఆళ్లగడ్డ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు నంబరు 36-2019 కేసును జడ్జి శైలజ విచారణ జరిపి నలుగురికి ఐదేళ్ల జైలు శిక్ష విధించారని అన్నారు. ప్రాస్యూక్యూషన్ తరఫున ఆళ్లగడ్డ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. శివప్రసాద్‌రావు తమ వాదనలను వినిపించారు.

జిల్లెల-1 ఎంపీటీసీ రాజీనామా


రాజీనామా పత్రాన్ని సీఈఓకు అందజేస్తున్న ఎంపీటీసీ రమాదేవి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా గోస్పాడు మండలం జిల్లెల-1 ఎంపీటీసీ సభ్యురాలు గోటికె రమాదేవి రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డికి రాజీనామా పత్రాన్ని అందజేశారు. వ్యక్తిగత కారణాలతో తాను రాజీనామా చేస్తున్నట్లు రమాదేవి వెల్లడించారు.


చౌడేశ్వరిదేవి అమ్మవారు


అమ్మవారి రథోత్సవం

ఘనంగా చౌడేశ్వరీ దేవి రథోత్సవం

●భారీగా తరలి వచ్చిన భక్తులు ● కిక్కిరిసిన కోడుమూరు

కోడుమూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌడేశ్వరీ దేవి ఉత్సవాల్లో భాగంగా గురువారం అటగార దేవాంగ దైవాచార సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి రథోత్సవం వైభవంగా జరిగింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రథోత్సవం తిలకించేందుకు భక్తులు భారీ ఎత్తున కోడుమూరు పట్టణానికి చేరుకున్నారు. దీంతో పట్టణం పురవీధులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. రథోత్సవ సందర్భంగా ఉదయం నుంచి చౌడేశ్వరీదేవి మాతకు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం పూలు, మామిడి తోరణాలతో రథాన్ని అలంకరించారు. చౌడేశ్వరీదేవి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహాన్ని రథంపై కొలువు ఉంచారు. అశేష భక్తుల మధ్య రథోత్సవం కన్నుల పండువగా సాగింది. అడుగడుగునా భక్తులు అమ్మా జగన్మాతా అంటూ రథంపై పూలు కురిపించారు. సీఐ తబ్రేజ్, ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు అదనపు బలగాలను రప్పించి బందోబస్తు చేపట్టారు. రథోత్సవం అనంతరం అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఆలయంలోకి క్యూ కట్టారు. దీంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. వైసీపీ నాయకులు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి ఆర్యవైశ్య మహాసభ ప్రథమ అధ్యక్షులు జయంతి వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు మురళీనాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు తిరుగు రథోత్సవం :

చౌడేశ్వరీదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తిరుగు రథోత్సవం నిర్వహించనున్నారు. శనివారం పారువేట, ఆదివారం వసంతోత్సవముతో అమ్మవారి ఉత్సవ వేడుకలు పూర్తవుతాయని అటగార దేవాంగ దైవాచార సంఘం సభ్యులు తెలిపారు.

● మురిపించిన ముద్దు పాపల పోటీలు

చౌడేశ్వరిదేవి జాతర పురస్కరించుకొని గురువారం సాయంత్రం సంతమార్కెట్లో చేపట్టిన చిన్నారి ముద్దు పాపల పోటీలు ప్రజలను మురిపించాయి. ఈ పోటీల్లో 0 నుంచి 1, 3 సంవత్సరాల చిన్నారులను వివిధ వేషధారణలతో పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను చూసేందుకు పెద్ద ఎత్తున మహిళలు కదలి వచ్చారు. ఈ పోటీల్లో గెలుపొందిన పిల్లలకు బంగారపు ఉంగరాలను సాక్రె వీరన్న బహూకరించనున్నారు.


పూజలందుకున్న మద్దమ్మవ్వ

వినియోగదారుల హక్కులను కాపాడాలి

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కులను కాపాడేలా ప్రభుత్వ శాఖలు గట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు, కూరగాయలు అమ్మే దుకాణాలను నిత్యం తనిఖీ చేస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. హోటళ్లు, సూపర్ మార్కెట్లు, ఎంఎల్ఎస్ పాయింట్లు, పెట్రోల్ బంకు, మార్కెట్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి తూకాల్లో మోసాలు, కల్తీ ఆహారం, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయంలాంటి మోసాలను అరికట్టాలన్నారు. వ్యవసాయ మార్కెట్లలో మిర్చి, పత్తి, ఇతర ధాన్యాల సేకరణ సమయంలో పెద్ద ఎత్తున జరిగే అమ్మకాల్లో తూకాల్లో ఎక్కువ మోసాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను సూచించారు. అన్ని ప్రభుత్వ సంస్థల్లో తాగునీటి ఏర్పాటు వంటి కనీస వసతులను ఏర్పాటు చేయాలని, అలాగే ప్రైవేటు సంస్థల్లో కూడా ఏర్పాటు చేసేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. హాస్పిటల్స్‌లో దివ్యాంగుల కోసం ర్యాంపులు, తాగునీటి వంటి వసతులను ఏర్పాటు చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో తగిన సదుపాయాలు కల్పించాలన్నారు. శానిటేషన్, తాగునీటి సరఫరా సక్రమంగా ఉండేలా క్లోరినేషన్ పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ, ఆర్టీసీ, మున్సిపాలిటీలు తదితర అన్ని శాఖలు వినియోగదారుల హక్కులకు భంగం కలగకుండా గట్టిగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు అదనపు మున్సిపల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, ఆదోని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, వినియోగదారుల సంఘం కార్యదర్శి శివమోహన్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పాల్గొన్నారు.

వైభవంగా మద్దమ్మ జాతర

● అశేషంగా కదిలి వచ్చిన జనం


రథం ముందు ఉన్న రాజుల దుస్తులతో ఉన్న యాదవ రాజులు

మద్దికెర, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మద్దికెర గ్రామ దేవత మద్దమ్మ జాతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలివస్తారు. మద్దమ్మ జాతర మహోత్సవం కన్నుల పండువగా అశేష జనవాహిని మధ్య జరిగింది. గురువారం తెల్లవారుజామున అమ్మవారి ఖడ్గానికి వైభవంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి తలంబ్రాలు పోసి చదివింపులు చదివించారు. అనంతరం ఉదయం మద్దికెర గ్రామ దేవత మూలవిరాట్ మద్దమ్మవ్వకు పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మధ్యాహ్నం గ్రామానికి చెందిన జంబునాథ్‌రాయుడు, సంధ్యారాణి, శ్రీనివాసులు, ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు అమ్మవారికి రథోత్సవం నిర్వహించేందుకు యాదవ రాజులుగా పిలువబడుతున్న చిన్న నగిరి, పెద్ద నగిరి యాదవరాజులు రాజు దుస్తులు ధరించుకుని తరలిరాగా రథోత్సవం ముందు హోమం నిర్వహించారు. అనంతరం రథోత్సవం ముందు యాదవ రాజులు ఉండగా అశేష జనవాహిని అమ్మవారి రథాన్ని లాగారు. రథోత్సవం ముందు హోమ పూజలు చేయగా ఉత్సవమూర్తి చిన్న మద్దమ్మను రథంలో ఏర్పాటు చేసి యాదవ వంశీకులైన చిన్న నగిరి, పెద్ద నగిరి వాసులు రథం ముందు రాజు దుస్తులతో ముందుకు రాగా రథాన్ని అశేష భక్తజన వాహిని మధ్య ముందుకు లాగారు. అమ్మవారి రథోత్సవంపై భక్తులు అరటి పండ్లు విసిరి భక్తిని చాటుకున్నారు. అనంతరం రాత్రి దేవాలయంలో చెక్కభజన కార్యక్రమాలు, ఉచిత పౌరాణిక నాటకాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ పులిశేఖర్ గౌడు, ఎస్ఐ విజయకుమార్ నాయక్ బందోబస్తు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దనగిరి, చిన్ననగిరి కులస్థులు భక్తులు పాల్గొన్నారు.

● మద్దమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు :

పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మద్దికెర గ్రామ దేవత మద్దమ్మవ్వను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు టీడీపీ నాయకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే రథోత్సవానికి కాయలు కొట్టి భక్తిని చాటుకున్నారు.


రథాన్ని లాగుతున్న భక్తులు

అన్నదాతలకు తీపి కబురు

● ఏప్రిల్ 1 నుంచి కొత్త పాసు పుస్తకాలు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రైతన్నలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఏప్రిల్ 1 నుంచి ఆంధ్రప్రదేశ్ రాజముద్ర ఉన్న కొత్త పాసు పుస్తకాలను పంపిణీ చేయాలని రెండు రోజుల క్రితం ప్రభుత్వం ప్రకటించింది. గత వైసీపీ ప్రభుత్వంలో భూములన్నీ తన కష్టార్జితం అన్న రీతిలో నాటి సీఎం జగన్ భూహక్కు పత్రాలపై తన బొమ్మతో కూడిన పత్రాలను రైతులకు పంపిణీ చేశారు. దీంతో రైతులు తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన తమ భూములకు జగన్ ఫొటో ఉండటంపై అసహనం వ్యక్తంచేశారు. పైగా గత వైసీపీ ప్రభుత్వంలో అందజేసిన పాసు పుస్తకాల్లో కూడా తప్పులు అధికంగా ఉండటంతో బ్యాంకర్లు పంట రుణాలను ఇచ్చేందుకు నిరాకరించారు.

● మార్చి నాటికి సర్వే రాళ్లపై జగన్ బొమ్మల తొలగింపు

గత వైసీపీ జగన్ హయాంలో రైతుల పొలాల సరిహద్దులను నిర్ణయిస్తూ పాతిన రాళ్లపై ముద్రించిన జగన్ బొమ్మతో పాటు రాతలను కూడా చెరిపేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పొలాల సరిహద్దులను నిర్ణయించడంలో జరిగిన తప్పు ఒప్పులను నిర్ణయించేందుకు ప్రతి మండలానికి ఒక గ్రామం చొప్పున మొదటి విడతగా అధికారులు రీసర్వే ప్రారంభించారు. ఈ రీసర్వే మార్చిలోపు పూర్తి చేసి రైతుల పొలాలను సక్రమంగా వారి చేతికి అందించేలా చర్యలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం రైతుల పొలాల్లో పాతిన జగన్ బొమ్మతో కూడిన రాళ్లను బొమ్మలను, రాతలను చెరిపివేసే కార్యక్రమాన్ని చేపట్టారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నడిచే మీడియేషన్ సెంటర్లలో మధ్యవర్తులుగా సేవలందించేందుకు ఆసక్తిగలిగి ఉన్న అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు గానూ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన సామాజిక కార్యకర్తలు, 15 సంవత్సరాల పాటు ఆయా రంగాల్లో అనుభవం కలిగిన నిష్ణాతులు, పదవీ విరమణ చేసిన సీనియర్ ఎగ్జిక్యూటీవ్‌లు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను ఈ నెల 17వ తేదీ లోపు జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన ప్రకటనలో కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు రేవతి ఎంపిక



నంద్యాల హస్పిటల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా క్రీడాకారిణి రేవతి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల కబడ్డీ అసోషియేషన్ సెక్రటరీ ఏపీ రెడ్డి తెలిపారు. ఐదు సంవత్సరాలుగా ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లా అసోసియేషన్ తరఫున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటూ ఎన్నో జాతీయ స్థాయి జూనియర్ పోటీల్లో పాల్గొని నంద్యాల జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చిన రేవతికి ఉమ్మడి జిల్లాల కబడ్డీ అసోసియేషన్ తరఫున అభినందనలు తెలియజేశారు. ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలోని పానిపట్‌లో జరిగే సీనియర్ నేషనల్ క్రీడల్లో కూడా మంచి ప్రతిభ చూపి నంద్యాల జిల్లాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

వేతన వ్యథలు..!

(5వ పేజీ తరువాయి)


కోడుమూరు మండలం ముడుములగుర్తి గ్రామంలో ఉపాధి పనుల్లో కూలీలు

● సీసీ రోడ్లకు బిల్లులు రూ.40 కోట్లు

మెటీరియల్ కాంపోనెంట్ అమౌంట్ రూ.40 కోట్ల బకాయి ఉంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టు పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లులు అందక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో సర్పంచులు, టీడీపీ కూటమి, గ్రామీణ నాయకులు అప్పులు చేసి పనులు చేస్తే.. సకాలంలో బిల్లులు రాక అప్పులపాలు అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మూడు వారాల కూలి డబ్బు రావాలి



మా ఊళ్లోనే నేను, నా భార్య, ముగ్గురు కొడుకులు, కోడళ్లు.. మొత్తం ఎనిమిది మంది ఉపాధి పనులకు వెళ్తున్నాం. రోజంతా కష్టపడితే రూ.250 కూడా గిట్టుబాటు కావడం లేదు. అయినా ఊళ్లోనే కాదా అని మట్టి పనులకు వెళ్తున్నాం. మూడు వారాలుగా ఉపాధి కూలి డబ్బు రూ.41 వేలు రావాల్సి ఉంది. అధికారులను అడిగితే అప్‌లోడ్ చేశాం.. ఏదో ఒకరోజు మీ అకౌంట్లో పడుతాయని అంటున్నారు. తిండిగింజలకు అప్పు పుట్టడం లేదు. అంగడికి వెళితే ఉద్దర ఇవ్వమంటున్నారు. చేసేది లేక ఉపాధి పనులు ఆపేసి రోజు కూలి వచ్చే పనులు వెతుక్కుంటున్నాం. రేపోమాపో వలస వెళ్లక తప్పని పరిస్థితి.

- బోయ వెంకటేశ్, కోగిలితోట గ్రామం, హొళగుంద మండలం

● ఆరు వారాలు నుంచి డబ్బు ఇవ్వడం లేదు



నేను ఒంటిరి మహిళను. కూలీనాలి చేసుకొని జీవనం సాగిస్తున్నాను. ఊళ్లోనే ఉపాధి పనులకు వెళ్తున్నాను. ఆరు వారాల నుంచి కూలి డబ్బులు ఇవ్వలేదు. ఇతర పనులకు వెళ్దామంటే వ్యవసాయ పనులు లేవు. చేతిలో చిల్లిగవ్వ లేదు. బతకడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం మా గోడు పట్టించుకొని వెంటనే ఉపాధి వేతనాలు చెల్లించాలి.

- అయ్యమ్మ, ఎర్రదొడ్డి గ్రామం, కోడుమూరు మండలం

● బ్యాంక్ ఖాతా చెక్ చేసుకోవాలంటున్నారు



నా భార్య గోవిందమ్మ, నేను ఇద్దరం ఉపాధి పనులకు వెళ్తున్నాం. నాలుగు వారాలుగా మాకు కూలి డబ్బు ఇవ్వలేదు. అధికారులను అడిగితే ఏదో ఒకరోజు డబ్బు వస్తుంది.. బ్యాంక్ ఖాతాను చెక్ చేసుకోవాలని అంటున్నారు. నిత్యం బ్యాంక్ ఖాతా చెక్ చేసుకుంటున్నాం. కరెంట్ బిల్లు, గ్యాస్ బిల్లు, రోజువారి ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నాం. ఎలా నెట్టుకురావాలో అర్థం కావడం లేదు.

- శివయ్య, వర్కూరు గ్రామం, కోడుమూరు మండలం

● రూ.22 కోట్ల బకాయి ఉంది

జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు రూ.22 కోట్లు వేతన బకాయి ఉన్నమాట నిజమే. జనవరి 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన వారందరికి ఖాతాలో డబ్బు పడింది. ఆ తరువాత వేతనాలు రావాల్సి ఉంది. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. మెటీరియల్ కాంపోనెంట్ అమౌంట్ రూ.40 కోట్లు బకాయి ఉంది.

- వెంకట రమణయ్య, డ్వామా పీడీ, కర్నూలు

'చెత్త వాహనాలు' అంతేనా..?

మరమ్మతులు చేయించడంలో అధికారుల కాలయాపన

రిపేరీ పనుల్లో రూ.28 లక్షలు పెండింగ్



కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో చెత్త తొలగించేందుకు వాడే వివిధ రకాల వాహనాలు మరమ్మతు కారణంగా చెత్త సేకరణకు పనికి రావడం లేదు. దీంతో పారిశుధ్య పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ వాహ నాలకు అధికారులు మరమ్మతు చేయించడం లేదు. గత సంవత్సరం వాహనాల మరమ్మతు పనులకు సుమారు రూ.42 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉండేవి. అప్పటి నుంచి రిపేరీ చేసే షోరూంలోనే ఉండపోయాయి. కమిషనర్‌గా రవీంద్రబా బు బాధ్యతలు చేపట్టాక రూ.14 లక్షలు చెల్లించారు. దీంతో కొన్ని వాహనాలను పారిశుధ్య పనుల్లో విని యోగిస్తున్నారు. మర మ్మతు చేయకపోవ డంతో ఇంకా 19 వాహనాలు నిరుపయోగంగా ఉండిపో యాయి. 19, ప్రైవేటు ఆసుప త్రుల సౌజన్యంతో మరో నాలుగు కలిసి 23 ట్రాక్టర్లు ఉన్నాయి. అదే విధంగా కంపాక్టర్లు పెద్దవి 5 ఉన్నాయి. చిన్నవి 10 ఉండగా 4 షోరూంలో ఉన్నాయి. నగర పాలక సంస్థకు 13 ఆటోలు ఉండగా ఒకటి రిపేరీలో ఉంది. ఎక్స్‌కవే టర్లు మూడు ఉండగా ఒకటి రిపేరిలో ఉంది. ఒక హిటాచి ఉండగా దాని మరమ్మతుల కోసం గత సంవత్సరం డిసెంబరులో రూ.3,50,000 ఖర్చు పెట్టారు. ఎనిమిది టిప్పర్లలో ఒకటి రిపేరిలో ఉంది. డ్రోజర్ ఒక్కటి ఉంది. గల్పర్లు 2 ఉండగా ఒక్కటి రిపేరిలో ఉంది. మినీ ఎక్స్‌కవేటర్లు ఐదు ఉండగా రెండు మాత్రమే పని చేస్తున్నాయి. మిగిలిన మూడు మరమ్మతులతో షోరూంలో ఉన్నాయి. ఇలా ప్రతి వాహనంలో ఒక్కటి షోరూంకే పరిమితం కావడంతో చెత్త సేకరణ ఇబ్బందిగా మారింది.

బిల్లులు పెండింగ్ ఉన్నాయి

మరమ్మతుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని చెల్లించిన వెంటనే వాహనాలు బయటికి వస్తాయి. చెత్త సేకరణకు ఎలాంటి అడ్డకుంలు ఉండవు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే అన్ని వాహనాలు వస్తాయి. **- కె.విశ్వేశ్వరరెడ్డి, ప్రజారోగ్య అధికారి.**

రూ.28 లక్షల పెండింగ్

నగరంలోని వివిధ రకాల షోరూంలో ఉన్న వాహనాల మరమ్మతులకు సుమారు రూ.28 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాహనాలన్నీ రిపేరీ అయ్యాయి. కేవలం బిల్లులు చెల్లించిన వెంటనే వాహనాలు బయటికి వస్తాయి. ఇటీవల మంత్రి టీజీ భరత్ వాహనాల మరమ్మతులపై ఉన్నతాధికారులతో ఆరా తీశారు. అయితే అన్ని వాహనాలు బయటనే ఉన్నాయని కొన్ని మాత్రమే షోరూంలో ఉన్నాయని అధికారులు చెప్పినట్లు తెలిసింది.



మరమ్మతులు చేస్తున్న మెకానిక్‌లు

చిన్నటేకూరు విద్యార్థులకు కలెక్టర్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ-మెడికల్ అకాడమిలో చదువుతున్న విద్యార్థులు, జేఈఈ-మెయిన్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా అభినందించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప ఆధ్వర్యంలో విద్యార్థులు కలెక్టర్‌ను కలిశారు. ఆయన విద్యార్థులను అభినందించి సత్కరించారు. అకాడమీలోని గ్రామాల విద్యార్థులు ర్యాంకులు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. త్వరలో కళాశాలను సందర్శించి విద్యార్థులు ఇంకా మెరుగైన ఫలితాలు సాధించడానికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో గురుకుల పాఠశాలల డీసీవో ఐ.శ్రీదేవి, అకడమిక్ డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, రిటైర్డ్ పీడీ చంద్రశేఖర్, అధ్యాపకులు ఉన్నారు.

భార్యను చంపిన కేసులో జీవిత ఖైదు



జైలుకు తరలిస్తున్న పోలీసులు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్తకు కోర్టు యావజ్జీవ కారగార జైలు శిక్ష విధించింది. ఆదోని కోర్టు లైజినింగ్ ఏఎస్ఐ నరసింహులు వివరాల మేరకు.. పెద్దకడుబూరు మండలం గంగులపాడు గ్రామానికి చెందిన కురువ నాగేష్‌కు కోసిగి మండలం సజ్జలగొడ్డంకు చెందిన జయలక్ష్మితో 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. పూర్తిగా మద్యానికి బానిస అయిన నాగేష్ తరచూ భార్యతో ఘర్షణకు దిగేవారు. ఈ క్రమంలోనే గత ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ రాత్రి భార్యా భర్తల మధ్య తీవ్రమైన ఘర్షణ చోటు చేసుకుంది. అనంతరం నిద్రలోకి జారుకున్న భార్య జయలక్ష్మి 21వ తేదీన తెల్లవారుజామున నిద్రిస్తున్న ఆమెపై గొడ్డలితో నరికి అతి కిరాతకంగా నాగేష్ హత్య చేశాడు. మృతురాలి తండ్రి ఎల్లప్ప ఫిర్యాదు మేరకు అప్పటి కోసిగి సీఐ ప్రసాద్ కేసు నమోదుచేసి విచారణలో భాగంగా కోర్టుకు అప్పజెప్పారు. గురువారం కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఆదోని సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి పి.జె సుధా యావజ్జీవ కారగార జైలు శిక్ష విధించారు. మృతురాలి తరపున పీపీలు మోతిలాల్, శ్రీనివాసులు వాదనలు వినిపించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

బనగానపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన జయమ్మ అనే మహిళపై లారీ టైర్లు ఎక్కటంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. బీసీ కాలనీ నుంచి పెట్రోల్ బంకు సర్కిల్‌కు జయమ్మ నడుచుకుంటూ వస్తుండగా ప్రమాదవశాత్తు లారీ వెనుక టైర్ల కింద పడటంతో రెండు కాళ్లు విరిగి పోయాయి. పోలీసుల జయమ్మను చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

హంద్రీ కాలువలో బాలుడి గల్లంతు



తులసి గౌడ్ (ఫైల్)

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువలో పడి ఓ బాలుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన మండలంలోని పందికోన గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. పందికోన గ్రామంలో జరిగిన ఆలయాల ప్రారంభ వేడుకలకు డోన్ పట్టణానికి చెందిన దామోదర్ గౌడ్, రామేశ్వరి దంపతుల కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. గురువారం ఉదయం దామోదర్‌గౌడ్ రెండో కుమారుడు తులసి గౌడ్ (11) ఉదయం 11 గంటల సమయంలో గ్రామ సమీపంలో ఉన్న హంద్రీ కాలువలో అదుపుతప్పి పడిపోయాడు. స్థానికులు గమనించి కేకలు వేయడంతో గ్రామానికి చెందిన కొందరు వచ్చి కాలువలో వెతికినా ఆచూకీ దొరకలేదు. విషయం తెలుసుకున్న సీఐ జయన్న తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని, స్థానికులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సాయంత్రం చీకటి పడే వరకు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ బాలుడు ఆచూకీ లభ్యం కాలేదు. బాలుడి గల్లంతు కావడంతో తల్లిదండ్రులు, బంధువులు రోదనలు పలువురిని కంటతడిపెట్టించాయి.

రోడ్డు ప్రమాదంలో గిరిజనుడి మృతి

- సర్వీసు రోడ్డు నిర్మించాలని హైవేపై బైఠాయింపు



జాతీయ రహదారిపై బైఠాయించిన గిరిజనులు

పాణ్యం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుగాలిమెట్ట వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గిరిజన యువకుడు మృతి చెందాడు. పాణ్యం ఇందిరా కాలనీకి చెందిన తోట అంజనేయులు(26), అతని సోదరుడు లక్ష్మన్న ద్విచక్ర వాహనంపై కమలాదిపల్లి నుంచి వెళుతూ సుగాలిమెట్ట వద్ద యూటర్న్ తీసుకుంటున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. అంజనేయులు అక్కడికక్కడే మృతి చెందగా లక్ష్మన్నకు తీవ్ర గాయాలయ్యాయి. సమా చారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పాణ్యం పోలీసులు పేర్కొన్నారు. హైవే అధికారులు గ్రామంలో సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయకపోవడమే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపించారు.

హైవేపై గిరిజనుల ధర్నా..

హైవే అధికారుల నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణమని గిరిజనులు, గ్రామస్తులు జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. సర్వీసు రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు.

మురుగు కాలువలో శిశువు మృతదేహం

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోగనూరు రోడ్డు అబ్బాస్ టాకీస్ పక్కన ఉన్న మురుగు కాలువలో నవజాత శిశువు మృతదేహం లభించింది. గుర్తు తెలియని వ్యక్తులు శిశువు మృత దేహాన్ని మురుగు కాలువలో పడేసి కాలువపై బండలు పెట్టి వెళ్ళిపోయారు. అయితే స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా శిశువు మృతదేహన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసును దర్యాప్తు చేపట్టారు.

అక్రమంగా ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలోని 103 ప్లాట్ల సొసైటీలో సభ్యులుకాని వ్యక్తులకు మాజీ అధ్యక్షుడు నారాయణ అక్రమంగా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించాడని ఆ సంఘం మాజీ అధ్యక్షుడు నాగరాజు ఆరోపించాడు. గురువారం జరిగిన సొసైటీ మాజీ బోర్డు డైరెక్టర్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2005 జూన్ నుంచి 2016 ఫిబ్రవరి వరకు సంస్థ అధ్యక్షుడిగా ఉన్న నారాయణ 1200 పైగా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేశాడని అన్నాడు. ఇందులో 102 ప్లాట్లు సొసైటీలో సభ్యులు కాని వాళ్లకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించాడని ఆరోపించాడు. దీని మీద అప్పటి కలెక్టర్ 2014లో ఐదుగురితో కమిటీతో విచారణ జరిపించి 102 ప్లాట్ల అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలకృష్ణ, నరసింహులు, అబ్రహాం, మద్దిలేటి, హరిశ్చంద్ర, లోకేశ్, అచ్చన్న పాల్గొన్నారు.

రీసర్వే పకడ్బందీగా చేయాలి

- జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్



ఆవులపల్లె గ్రామంలో రీసర్వేను పరిశీలిస్తున్న నంద్యాల జేసీ విష్ణుచరణ్

చాగలమర్రి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూ రీసర్వేను పక్కాగా నిర్వహించాలని మండల, గ్రామస్థాయిలో సర్వేయర్లు, వీఆర్వోలను జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఆదేశించారు. గురువారం మండలంలోని ఆవులపల్లె గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వే పనులను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూముల రికార్డులను, భూ కొలతలను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలోని 28 మండలాల్లో భూ రీసర్వే పనులు ప్రారంభించామని అన్నారు. మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రీసర్వే చేస్తున్నామని అన్నారు. ఒక్కో గ్రామానికి 7 బ్లాక్‌లుగా విభజించి రోజుకు 20 నుంచి 25 ఎకరాలు సర్వే చేసేలా ప్రణాళిక చేశామని అన్నారు. మండల సర్వేయర్‌తో పాటు గ్రామ సర్వేయర్లతో రెండు టీమ్‌లుగా ఏర్పాటు చేసి రైతుల సమక్షంలో రోవర్‌తో భూ రీసర్వే చేస్తున్నామని అన్నారు. రైతులకు ముందుగానే నోటీసులు అందజేస్తామని అన్నారు. అందుబాటులో లేని రైతులకు ఫోన్ వాట్సాప్ ద్వారా తెలియజేస్తున్నామని అన్నారు. చాగలమర్రి మండలంలో నేలంపాడు, ఆవులపల్లె గ్రామాల్లో 1175 పట్టాభూములు, 170 ఎకరాలు ప్రభుత్వ భూమిగా గుర్తించామని అన్నారు. సర్వే నంబర్‌ల ఆధారంగా భూములు కొలతలు తీస్తున్నామని అన్నారు. రైతులకు ఎటువంటి నష్టం జరుగకుండా ఉండేలా భూ కొలతలు తీస్తున్నారని తెలిపారు. గతంలో జరిగిన భూ రీసర్వేలో రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం తిరిగి ప్రత్యేకంగా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశాలు రావడంతో తిరిగి గ్రామాల్లో భూ రీసర్వే పనులు జనవరి నుంచి ప్రారంభించామన్నారు. రెవెన్యూ సదస్సులు, భూ రీసర్వే గ్రామసభలు నిర్వహించి రైతుల నుంచి అర్జీలను స్వీకరించామన్నారు. వాటిని కూడా పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆర్డీవో చల్లా విశ్వనాథ్, తహసీల్దార్ రవికుమార్, డీటీ విజయ్‌కుమార్, డిప్యూటీ సర్వేయర్ల ఇన్‌స్పెక్టర్ నీలకంఠం, మండల సర్వేయర్ మద్దిలేటి, ఆర్ఐ అబ్దుల్‌సత్తార్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, కార్యదర్శులు, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల పట్టాల కొనుగోలుపై విచారణ

ప్రభుత్వం మంజూరు చేసిన పేదల ఇళ్ల పట్టాలను కొనుగోలు చేసిన వాటిపై విచారణ చేపడతామని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ తెలిపారు. ఇళ్ల పట్టాలను కొనుగోలు చేసి ఉంటే వాటిని రద్దు చేస్తామన్నారు.

బ్రాహ్మణపల్లె వంతెన పనులు చేపట్టాలి

వక్కిలేరు వాగుపై వంతెన పనులు చేపట్టాలని ఆవులపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాలకు చెందిన ప్రజలు జేసీ విష్ణుచరణ్‌కు గురువారం విన్నవించుకున్నారు. లో లెవెల్ వంతెన ఉండటంతో ప్రతి ఏడాది వరద నీటితో రాకపోకలతో స్తంభించి ఇబ్బంది పడుతున్నామని అన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

- మంత్రి లోకేశ్‌ను కలిసిన గోగిశెట్టి నరసింహారావు



ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలను లోకేశ్‌కు చూపుతున్న నరసింహారావు

శిరివెళ్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు కోరారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని నివాసంలో గోగిశెట్టి నరసింహారావు గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. నంద్యాల, కర్నూలు జిల్లాల్లోని రాజకీయ పరిస్థితులపై మంత్రితో చర్చించారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన పలు కథనాలు, అంశాలను లోకేశ్‌కు వివరించారు. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని ఆయన కోరారు. సీఎం చంద్రబాబు నాయుడు విజన్, పారదర్శక పాలనతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడంతో పాటు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ వెల్లడించినట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు తెలిపారు.

చెత్త సంపద కేంద్రాలను ఉపయోగంలోకి తేవాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారి భాస్కర్

గోనెగండ్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కింద ఈ నెల 15వ తేది నుంచి జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలలో ఉన్న చెత్త సంపద కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకురావాలని డీపీవో భాస్కర్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. గురువారం గోనెగండ్లలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలోని 484 పంచాయతీలలో 484 చెత్త సంపద కేంద్రాలు ఉన్నాయని, వీటి అన్నింటిని ఉపయోగంలోకి తీసుకువచ్చి వర్మికంపోస్టు ఎరువులా పంచాయతీలకు ఆదాయం తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్‌ను ఈ నెల 15న కలెక్టర్ రంజిత్ బాషా గోనెగండ్లలో ప్రారంభిస్తారని తెలిపారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు గ్రామాలలోని ఇంటింటి వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను సేకరించాలని అన్నారు. గ్రామాలలో మార్చి 31వ తేదిలోపు ఇండ్లు, కొళాయిలు, దుకాణాల పన్ను వందశాతం వసూలు చేయాలన్నారు. ఎంపీడీవో మణిమంజరి, ఈవోఆర్‌డీ అనంతశయన, గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్‌బాషా, అనిల్, సుబాన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కర్నూలు హస్పిటల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలోని ప్రాంతీయ శిక్షణ కేంద్రం(పురుషులు)లో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. వైద్య ఆరోగ్యశాఖకు చెందిన కాలం చెల్లిన 3 వాహనాలు, ఒక అంబులెన్స్ పూర్తిగా కాలిపోయాయి. 2018లో ఇమ్యూనైజేషన్ కార్యాలయ భవనంలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వాహనాలను ప్రాంతీయ శిక్షణ కేంద్రానికి తరలించారు. గతంలో కాలపరిమితి దాటిన వాహనాలు, వేలం వేసిన వాహనాలు కూడా ఇందులో కాలిపోవడం విశేషం. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో డీఎంహెచ్‌వో కార్యాలయం ఆవరణలో దట్టమైన పొగలు వ్యాపించడంతో ప్రజలు భారీగా ఇక్కడికి తరలివచ్చారు. ప్రాంతీయ శిక్షణ కేంద్రం(పురుషులు) ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిమేల్ ట్రైనింగ్ సెంటరులో ఓ వ్యక్తి సిగరెట్ కాల్చి దాన్ని మేల్ ట్రైనింగ్ సెంటరులో వేయడం వల్ల అగ్ని ప్రమాదం జరిగిందని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. అగ్ని ప్రమాదంపై డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ, త్రీటౌన్ పోలీస్ స్టేషన్, వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అధికారికి ఫిర్యాదు చేశారు. మంటలను అగ్ని ప్రమాపక సిబ్బంది ఆర్పివేశారు.

మొక్క జొన్న పంటపై పందుల దాడి ..

- 11ఎకరాల్లో రూ.4లక్షల పంట నష్టం



పందుల దాడిలో దెబ్బతిన్న పంట

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ సమీపంలోని మొక్క జొన్న పంటపై ఊర పందులు చిందులు తొక్కాయి. బుధవారం రాత్రి మొక్క జొన్న పంటపై దాడి చేసి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. కోత దశలో ఉన్న మొక్క జొన్న కంకులను పందులు ఇష్టానుసారంగా తిన్నాయి. రైతులు పుట్లూరు చెన్నారెడ్డి, సాగర్‌రెడ్డి, శరత్‌కుమార్ రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి తదితరుల 11ఎకరాల్లో పంట దిగుబడి వచ్చే సమయంలో పందులు దాడి చేయడంతో రూ.4లక్షలకు పైగా నష్టం వాటిల్లింది.

పిడుగుపాటు మృతుల కుటుంబాలకు పరిహారం

- ఉప లోకాయుక్త రజని

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు మృతి చెందిన వారి కుటుంబాలు నష్టపరిహారాన్ని పొందవచ్చని రాష్ట్ర ఉప లోకాయుక్త పి. రజని ప్రకటనలో తెలియజేశారు. బాధిత కుటుంబాలు రాష్ట్ర ప్రభుత్వానికి ముందుగా దరఖాస్తు చేసుకోవాలని, పరిహారం చెల్లింపులో జాప్యం జరిగితే బాధితులు నేరుగా లోకాయుక్తను ఆశ్రయించవచ్చునని ఆమె తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

శ్రీయుత సంయుక్త కలెక్టర్ వారి కార్యాలయము : కర్నూలు

ఆర్.సి.నెం.CS1/01/2024 **బహిరంగ వేలము ప్రకటన** తేది: 13-02-2025

శ్రీయుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల కమీషనరు వారి ఉత్తర్వుల మేరకు కర్నూలు జిల్లాలోని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ మండల స్థాయి గోదాములలో నిల్వ ఉన్న **సుమారు 436.775 మెట్రిక్ టన్నుల సీజ్ చేయబడిన బియ్యము**కు సంబంధించి బహిరంగ వేలము వేయుటకు నిర్దేశించిన ప్రకారము ఈ క్రింద తెలుపబడిన మండల స్థాయి గోదాముల నందు గల బియ్యము వివరముల ప్రకారము బహిరంగ వేలము జరిపించుటకు గాను ఆసక్తి గల వారు ఈ క్రింద చూపబడిన తేది మరియు సమయమునకు కర్నూలు జిల్లా సంయుక్త కలెక్టర్ గారి కార్యాలయము, కలెక్టర్ కాంప్లెక్స్ నందు హాజరు కావలసినదిగా తెలుపడమైనది.

Sl.No.	Name of the MLS Point	Seized Rice in MTS		
		Good Condition	Bad Condition	Total Seized Rice
1	Adoni	66.900	0	66.900
2	Alur	36.645	0	36.645
3	Gudur	22.720	0	22.720
4	Kurnool	196.966	0	196.966
5	Pathikonda	26.032	0	26.032
6	Veldurthy	14.202	0	14.202
7	Yemmiganur	68.81	1.500	70.310
	Total	**435.275**	**1.500**	**436.775**

వేలం జరుగు ప్రదేశం : జిల్లా సంయుక్త కలెక్టర్ వారి కార్యాలయం, కలెక్టరేట్ కాంప్లెక్స్, కర్నూలు.
తేది : 21.02.2025, సమయం : ఉదయం 11.00 గంటలకు

నిబంధనలు : 1) బహిరంగ వేలంలో పాల్గొనదలచినవారు ముందుగా ధరావత్తు రూ.2,00,000/- మాత్రమే డి.డి రూపంలో జిల్లా సంయుక్త కలెక్టర్, కర్నూలు వారి పేరున చెల్లించి, సదరు డి.డిని కర్నూలు జిల్లా పౌరసరఫరాల అధికారికి అందజేసి తేది 19-02-2025 సాయంత్రం 5.00 గంటలలోపు దరఖాస్తు పొందవలెను. [illegible]

సం/- జి.నవ్య, జాయింట్ కలెక్టర్, కర్నూలు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: మంత్రి బీసీ



హైవే పనులను పరిశీలిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

పాణ్యం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. గురువారం మండలంలోని తమ్మరాజుపల్లె వద్ద జరుగుతున్న హైవే పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని సూచించారు.

విద్యార్థుల అస్వస్థతపై విచారణ



వంట సిబ్బందిని విచారిస్తున్న ఉన్నతాధికారులు

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కేజీబీవీలో విద్యార్థులు అస్వస్థత గురికావడంతో జిల్లా ఉన్నతాధికారులు గురువారం సమగ్ర విచారణ చేశారు. బండిఆత్మకూరులోని కేజీబీవీలో సమగ్ర శిక్షణ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమంత్‌కుమార్, ఆల్టర్నేటివ్ కో ఆర్డినేటర్ రఘురామిరెడ్డి, ఏఎంవో లలితకుమారి విచారించారు. పాఠశాల ఎస్‌వో దాక్షాయణితో, విద్యార్థులతో, వంట సిబ్బందితో వేర్వేరుగా విచారణ చేపట్టారు. అలాగే వైద్యులు భావన, సవితను విచారించారు. అనంతరం అధికారులు విలేకరులతో మాట్లాడుతూ జరిగిన ఘటనపై చేసిన విచారణ పూర్తి సారాంశంతో కూడిన నివేదిక కలెక్టర్, జేసీకి అందజేస్తామని చెప్పారు. విచారణలో ఎంఈవోలు, ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

'రీఫండ్‌కు దరఖాస్తు చేసుకోండి'

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాల కోసం ముందస్తుగా లబ్ధిదారుల వాటాగా చెల్లించిన దరఖాస్తు దారులు తమ వాటా రీఫండ్ కోసం సరైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందస్తుగా చెల్లించవలసిన వాటాను ప్రభుత్వం సవరించింది. ఈ మేరకు కేటగిరి-1 కింద 300 చదరపు అడుగుల గృహానికి ముందస్తు వాటా రూ. 500 కాగా సవరించిన వాటా రూ. 1 మాత్రమే, కేటగిరి-2 కింద 365 చదరపు అడుగుల ఇంటికి ముందస్తు వాటా రూ.50 వేలు కాగా సవరించిన వాటా రూ.25 వేలు, కేటగిరి-3 కింద 430 చదరపు అడుగుల ఇంటికి రూ. లక్ష కాగా సవరించిన వాటా రూ. 50 వేలు మాత్రమే. నంద్యాల మున్సిపాలిటిలో నగదు లేదా డీడీ రూపంలో జమ చేసిన రసీదు, గృహం మంజూరైన పత్రం, ఆధార్ కార్డు నకలు, దరఖాస్తుదారుని అకౌంట్ నెం., గృహలోన్ సంబంధిత బ్యాంక్ అకౌంట్ నెంలు పొందుపరిచి సరైన వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సదరు దరఖాస్తును దరఖాస్తుదారుల వార్డు పరిధిలోని వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శికి ఇవ్వాలని తెలిపారు.

మంత్రికి ఇజితెమా కమిటీ సభ్యుల సన్మానం

ఆత్మకూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో జనవరి 7,8,9 తేదీల్లో నిర్వహించిన ఉమూమి తబ్లిగీ ఇజితెమా కార్యక్రమం విజయవంతం కావడం పట్ల గురువారం ఇజ్‌తెమా కమిటీ వారు నంద్యాలలో రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ.ఫరూక్‌ను సత్కరించారు. ఆత్మకూరులో జరిగిన ఇజితెమాకు ప్రభుత్వం తరుపున రూ.2కోట్ల నిధులు కేటాయింపజేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. వీరి వెంట కమిటీ సభ్యులు నూర్‌బేగ్, రజాక్, ఇషాక్, షాలీఫైల్వాన్ తదితరులు ఉన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

వెలుగోడు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వెలుగోడు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావశం ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసినట్లు ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి తెలిపారు. గురువారం ఎంపీపీ రమేష్ అధ్యక్షతన సమావేశం జరగాల్సి ఉండగా.. ఎంపీటీసీలు గైర్హాజర్ కావడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేశారు. అయితే.. అధికారులు ప్రజాప్రతినిధులు వస్తారని, సమావేశాన్ని నిర్వహించారు. అయితే.. సమయం అధికమవుతున్నా సభ్యులు రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

డ్రోన్ కెమెరాతో నిఘా

కొత్తపల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి, గువ్వలకుంట్ల గ్రామ శివారులలో నిఘా నియంత్రణకై డ్రోన్ కెమెరాతో కొత్తపల్లి పోలీసు యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఎస్పీ ఆదేశాల మేరకు ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, సీఐ సురేష్ కుమార్ రెడ్డి సూచనల మేరకు కొత్తపల్లి ఎస్ఐ కేశవ ఆధ్వర్యంలో నేరాల నియంత్రణకు గ్రామ శివారు ప్రాంతాల్లో చట్ట వ్యతిరేక అసాంఘీక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వంటి వాటికి అడ్డుకట వేసేందుకు డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమ మద్యం, పేకాట, నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

'బాల్య వివాహాలు చేయొద్దు'

పాములపాడు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయొద్దని న్యాయవాది బతుకయ్య సూచించారు. ఆత్మకూరు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు పాములపాడు మండలంలోని తుమ్మలూరు గ్రామంలో బతుకయ్య ఆధ్వర్యంలో గురువారం బాలస్వాస్థ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ వరప్రసాద్, ఏఎన్ఎంలు చౌదమ్మ,శ్వేత, గ్రామ నాయకులుయేసేపు, మోహన్, వలంటీర్ శివకుమార్ పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

పగిడ్యాల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తూర్పు ప్రాతకోట గ్రామానికి చెందిన పి. మహేశ్వరరెడ్డి అక్రమంగా మద్యం విక్రయిస్తుండటంతో గురువారం పోలీస్‌లు దాడులు నిర్వహించి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన మహేశ్వరరెడ్డి అక్రమంగా మద్యం విక్రయిస్తుడటంతో సిబ్బందితో కలిసి తనిఖీలు చేయగా అతడి ఇంట్లో 9 బీర్లు, 9 మద్యం సీసాలు దొరికినట్లు తెలిపారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని బెల్టుషాపు నిర్వాహకుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'ప్రమాద బీమా చేయించుకోవాలి'

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్లు ప్రమాదబీమా చేయించుకోవాలని ఆర్టీవో కార్యాలయ ఎంవీఐ తిమ్మరుసునాయుడు సూచించారు. జాతీయ రహదారి భద్రతామాసోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నంద్యాలలోని లారీ అసోసియేషన్ కార్యాలయంలో కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏఎంవీఐ ప్రదీప్‌రెడ్డి, లారీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేడెక్కిన రాజకీయం

● ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌ను పదవి నుంచి దించడానికి కౌన్సిలర్ల ప్రయత్నాలు?

● అవిశ్వాసం, మూకుమ్మడి రాజీనామాలకూ సిద్ధం?



ఆత్మకూరు మున్సిపాలిటీ



ఇటీవల శిల్పాను కలిసిన చైర్ పర్సన్ మారూఫ్ ఆసియా



బైర్లూటి దర్గా వద్ద విందులో పాల్గొన్న కౌన్సిలర్లు

ఆత్మకూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారుఫ్ ఆసియాను అవిశ్వాస తీర్మానంతో పదవి నుంచి దించేందుకు వైసీపీ కౌన్సిలర్లు మరింత కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే అంశంపై ఈ నెల 5వ తేదిన వైసీపీకి చెందిన సుమారు 16 మంది కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని హైదరాబాద్‌లో ప్రత్యేకంగా కలిసి అవిశ్వాస తీర్మానంపై చర్చించినట్లు తెలిసింది. పైగా 20 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన ప్రతిపాదనను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. అయితే తాజాగా గురువారం ఆత్మకూరు మండలంలోని బైర్లూటి దర్గా వద్ద వైసీపీ కౌన్సిలర్లు విందు ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో ప్రధానంగా అవిశ్వాస తీర్మానంపైనే చర్చ జరిగినట్లు ఆ పార్టీ శ్రేణులే చర్చించుకుంటున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియాతో పాటు ఆమె తండ్రి, కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్ కౌన్సిలర్లను కలుపుకోవడం లేదని ఆరోపిస్తూ వారు ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. పట్టణంలో మొత్తం 24 వార్డు ఉండగా అందులో 20 మంది వైసీపీ కౌన్సిలర్లు అవిశ్వాసంపై ముక్తకంఠంతో ఉన్నట్లు సమాచారం. దీంతో ఈ వ్యవహారం ఆత్మకూరు ప్రాంతంలో హాట్ టాపిక్‌గా మారింది.

ఇటీవల శిల్పాను కలిసిన చైర్‌పర్సన్

ఆత్మకూరు మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ అవిశ్వాస తీర్మాన అంశం రాజకీయ కాకపుట్టిస్తున్న తరుణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మారూఫ్ ఆసియా, ఆమె తండ్రి ఎంఏ రషీద్ ఈ నెల 11వ తేదిన హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని కలవడం మరింత గందరగోళానికి దారితీస్తోంది. వాస్తవానికి మున్సిపల్ చైర్‌పర్సన్ వైసీపీ తరుపునే ఎన్నిక కాగా పార్టీలో నెలకొన్న అంతర్గత విబేధాల వల్ల చైర్‌పర్సన్‌తో పాటు ఆమె తండ్రి ఎన్నికల ముందు పార్టీ కార్యక్రమాలకు కొంత దూరంగా ఉన్నారు. ఆ తర్వాత టీడీపీలోకి చేరాలని మంతనాలు కూడా జరిపి చివరి సమయంలో మళ్లీ వైసీపీలోనే ఉండిపోయారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమి చెవిచూడటంతో మళ్లీ వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో వీరి తీరుపై ఆగ్రహంగా ఉన్న మాజీ ఎమ్మెల్యే శిల్పా కూడా చైర్‌పర్సన్ పదవి నుంచి దించాలన్న యోచనలో ఉన్నట్లు తెలిసింది. దీనికితోడు అధిక సంఖ్యలో కౌన్సిలర్లు పట్టుపట్టి అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేయడంతో ఈ విషయంలో ముందుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా భావించినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, ఆమె తండ్రి ఎంఏ.రషీద్ మాజీ ఎమ్మెల్యే శిల్పాను కలవడం వైసీపీలోనే రాజకీయ దుమారం రేపుతోంది. అవిశ్వాస తీర్మానంలో తన ప్రమేయమేమి లేదని, ఏదైనా ఉంటే కౌన్సిలర్లతో మాట్లాడి ఓ నిర్ణయానికి రావాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా చైర్‌పర్సన్‌కు, ఆమె తండ్రికి సూచించినట్లు తెలిసింది. కానీ ఈ విషయంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా నుంచి క్లారిటీ లేకపోవడంతో ఎన్నికల ముందు వారిని టీడీపీలోకి వెళ్లకుండా బుజ్జగింపులు చేసిన కడప జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి ద్వారా వైసీపీ అధినేత జగన్‌ను కలవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వర్గీయుకులు ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పార్టీ ఫిరాయింపునకూ సిద్ధం?

మున్సిపల్ చెర్‌పర్సన్ మారుఫ్ ఆసియా, కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రషీద్ మాజీ ఎమ్మెల్యేను శిల్పాను కలిసిన నేపథ్యంలో అవిశ్వాస తీర్మానంపై మాజీ ఎమ్మెల్యే శిల్పా తమకు సహకరించకపోతే మూకుమ్మడి రాజీనామాలు చేసేందుకు కూడా సిద్ధమైనట్లు తెలుస్తోంది. అవసరమైతే పార్టీ ఫిరాయింపునకు పాల్పడి టీడీపీతో చేతులు కలిపేందుకు వైసీపీ కౌన్సిలర్లు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎట్టి పరిస్థితుల్లో అవిశ్వాస తీర్మానం నెగ్గాలని కౌన్సిలర్లు రోజూ రహస్య చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. కాగా పట్టణానికి చెందిన ఓ వైసీపీ కీలక కౌన్సిలర్ అవసరమైతే టీడీపీ తరఫున చైర్మన్ పదవి దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నట్లు తెలిసింది. భారీ ఖర్చు చేసేందుకు కూడా ఆయన సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అయితే వైసీపీలోనే నెలకొన్న ఈ విబేధాలను మాత్రం శ్రీశైలంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మనకెందుకులే అని వదిలేసినట్లు తెలుస్తోంది.

వదంతులు నమ్మకండి

● నిజమైన లబ్ధిదారులు ఆందోళన చెందవద్దు

● న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రజలను రెచ్చగొట్టే ఫేక్ వార్తలు, వదంతులు నమ్మొద్దని న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సూచించారు. కానాల గ్రామంలో గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలను ప్రస్తుతం ప్రభుత్వం వెనక్కి తీసుకుంటోందని సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో కానాల గ్రామానికి చెందిన లబ్ధిదారులు నంద్యాలలోని టీడీపీ కార్యాలయానికి వచ్చారు. అక్కడ మంత్రి ఫరూక్‌ను కలిశారు. మంత్రి వారితో మాట్లాడుతూ అర్హులెవరికీ అన్యాయం జరగదని, ఆందోళన చెందవద్దని సూచించారు. అర్హులకు స్థలంతో పాటు ఇళ్ల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. మంత్రి హామీతో గ్రామస్థులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

● రాష్ట్ర న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి గురువారం పీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో 15 మంది లబ్ధిదారులకు రూ. 17 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నంద్యాల, ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన నంద్యాల రావూస్ కళాశాల విద్యార్థులను రాష్ట్ర న్యాయ, మైనార్టీశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ నంద్యాలలోని తన కార్యాలయంలో అభినందించారు. అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన పూర్ణేశ్‌రావు, సహస్ర, శ్రావ్య, సభాను మంత్రి సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మోనిచంద్ర, ప్రిన్సిపాల్ సుంకన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

● ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వేసవిలో నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. మల్యాల గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ మదర్ ప్లాంట్‌ను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో నిర్వహణ నిధులు మంజూరు కాకపోవడంతో ఎన్టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్ మూలన పడిందన్నారు. రూ.4 లక్షలు మంజూరు చేయించి మల్యాల, అల్లూరు, కోనేటమ్మపల్లె గ్రామాలకు నీరు అందించడానికి ఈ ప్లాంట్‌ను పునఃప్రారంభించినట్లు తెలిపారు. నీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు, గ్రామ సర్పంచులకు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుమాధురి మాట్లాడుతూ రిమోట్ డిస్పెన్సింగ్ యూనిట్లను మరమ్మతులు చేయించి మిగతా గ్రామాలకు నీటిని అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీవో సుబ్రమణ్యశర్మ, ఈవోఆర్డీ రంగనాయక్, టీడీపీ సీనియర్ నాయకుడు మాండ్ర సురేంద్ర నాథరెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, ఎంపీటీసీ మద్దిలేటి, బాలమద్దయ్య, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● నందికొట్కూరు ఎంపీడీవో కార్యాలయంలో వివిధ మండలాల ఎంపీడీవోలు, నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ బేబి, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో ఎమ్మెల్యే జయసూర్య సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలో, గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

జూపాడుబంగ్లా: భాస్కరాపురం గ్రామంలో రాజు అలియాస్ దావీదు బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందడంతో ఎమ్మెల్యే జయసూర్య గురువారం ఉదయం గ్రామానికి వచ్చి పూలమాలవేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. హుసేనయ్య, సోమన్న, సోమశేఖర్‌గౌడు, స్వామన్న, జమజన్న, ఏసన్న, ప్రతాప్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

నేడు జాబ్ మేళా

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేడు నిర్వహించే జాబ్‌మేళాలో అగ్రిసోల్ ఇండియా, వికాసభారత్, ఐటీఎం స్కిల్స్ అకాడమీ, ఎనోవిజన్ ఇంటిగ్రేటెడ్ కంపెనీలు పాల్గొంటున్నాయని, ఎస్సెస్సీ, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ మరియు బిటెక్ పూర్తిచేసిన వారు ఇంటర్వ్యూల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు వారి విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు ఫోటోలతో హాజరుకావాలని సూచించారు.

18న శ్రీరామకృష్ణా డిగ్రీ కళాశాలలో..

నంద్యాల శ్రీ రామకృష్ణా డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకులకు ఈనెల 18వ తేదీన ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు శ్రీ రామకృష్ణా విద్యా సంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి తెలిపారు. కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ బహుళ జాతి కంపెనీ అయిన ఆల్టిగో టెక్ ప్రైవేట్ లిమిటెడ్ నిరుద్యోగులకు ఈనెల 18న ఉదయం కళాశాలలోని వివేకానంద ఆడిటోరియంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి కంపెనీకి చెందిన చెన్నై, బెంగుళూరులో పనిచేయవలిసి ఉంటుందని వివరించారు. జాబ్‌మేళాకు హాజరయ్యే విద్యార్థులు కళాశాలలో సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలని, ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు విద్యార్హత పత్రాలను, బయోడేటా, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని చెప్పారు. ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ యూవీఎస్ కుమార్, కేఎస్ కుమార్ పాల్గొన్నారు.

హోరాహోరీగా గాడిదల పందెం

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నంద్యాల జంబులాపరమేశ్వరీ అమ్మవారి తిరుణాల సందర్భంగా గురువారం గాడిదల పందేలు జోరుగా హుషారుగా సాగాయి. ఆలయ ప్రధానకార్యదర్శి గాండ్ల జగన్, టీడీపీ నాయకుడు నేత జిల్లెల్ల శ్రీరాములు పలువురు ప్రముఖులు గాడిదల పందాలను ప్రారంభించారు. ఈ పోటీల్లో 13గాడిదలు పాల్గొన్నాయి. పోటీల్లో గెలిచిన టాప్ 8 గాడిదల యజమానులకు వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ. 6 వేలు, రూ.4 వేలు, రూ. 3 వేలు, రూ.2 వేలు, రూ. 1500, రూ.1000 నగదును బహుమతులు వరుసగా పెద్ద వంగలి పెద్ద పాములేటి, జంగాలపల్లె చాకలి అంజి, మిట్టపల్లె కళ్యాణ్, బాచిపల్లె నాగవైష్ణవి, బాచిపల్లె నాగేష్, వెల్పనూరు ఎల్ల నాగమయ్య, మిట్టపల్లె పెద్దయ్య, కొత్తపల్లె నరసింహులు బహుమతులు అందుకున్నారు.

శ్రీశైలంలో పారిశుధ్య పనులు

శ్రీశైలం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం స్వచ్ఛ శ్రీశైలం నిర్వహణలో భాగంగా గురువారం క్షేత్రపరిధిలో పలు ప్రాంతాలలో పారిశుధ్య స్వచ్ఛ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన రహదారులు, ఆలయ మాడవీధులు, టూరిస్టు బస్టాండు, ఆర్టీసీ బస్టాండు, మల్లికార్జున సదన్, పంచ మఠాలను శుభ్రం చేశారు.


'రోడ్డు పక్కన మద్యం దుకాణం తొలగించాలి'



కేజీ రోడ్డుపై ధర్నా చేస్తున్న స్థానికులు

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జూపాడుబంగ్లాలో కేజీ రోడ్డు పక్కన మద్యం దుకాణం తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం లేదని గురువారం మద్యం దుకాణం ఎదుట కేజీ రోడ్డుపై ఆందోళనకు దిగారు. ఇక్కడ పెడితే స్థానికులు, కాసానగర్‌కు వెళ్లే మహిళలకు తాగుబోతుల వల్ల ఇబ్బందులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచి జనావాసాలు లేనిచోట మద్యం దుకాణం పెట్టుకోవాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరగంటపాటు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సర్ది చెప్పి పంపించారు. అనంతరం గ్రామస్థులు పోలీసుస్టేషను, తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృపాకర్, మల్లయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీఎం నిర్ణయంపై హర్షం



మాట్లాడుతున్న జై గౌడ సేన నాయకులు

నందికొట్కూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గౌడ కులస్థుల ఆర్థికాభివృద్ధి కోసం మద్యం దుకాణాల కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు జై గౌడ సేన జాతీయ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. గురువారం పట్టణంలోని జై గౌడ సేన నాయకుల ఆధ్వర్యంలో జై గౌడ సేన జాతీయ నాయకులు డా.మొర్ల ఏడుకొండల గౌడ్, మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని సాహసాన్ని కూటమి ప్రభుత్వం చేసిందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివ్వాజి చంద్రశేఖర్‌గౌడ్, నంద్యాల జిల్లా అధ్యక్షులు పిట్ట ఎల్లా గౌడ్, కర్నూలు జిల్లా అధ్యక్షులు సూర్యనారాయణ గౌడ్, గౌరవాధ్యక్షులు తుడిజర్ల నాగేంద్ర గౌడ్, జివ్వాజి సుంకన్న గౌడ్ సేవా సమితి అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, రవి గౌడ్, నారాయణ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె/ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులకు సూచించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఆయిల్ పామ్ సాగు, పండ్ల తోటల విస్తరణ, డ్రిప్‌సౌకర్యం తదితర అంశాలపై సంబంధిత అధికారులు, కంపెనీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 400 హెక్టార్ల ఆయిల్ పామ్ సాగుకు గానూ 362 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు అయిందని చెప్పారు. నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ముందస్తుగా ఒప్పందం కుదుర్చుకొన్న వివిధ కంపెనీలు నిర్దేశిత లక్ష్యాలను పూర్తిచేయడంతోపాటు బిందుసేద్యం పరికరాల ఏర్పాటుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని ప్రోత్సహించాలన్నారు. బిందు సేద్యం పరికరాలను 90శాతం రాయితీతో ప్రభుత్వం ఇస్తోందన్నారు. పండ్ల తోటల విస్తీర్ణంలో ఈ ఏడాది నిర్దేశిత 752 హెక్టార్ల లక్ష్యానికి 300హెక్టార్లు మాత్రమే చేశారని మిగిలిన 452 హెక్టార్లలో లిల్లీ, జాజి, విరజాజి, కనకాంబరం, మల్లె తదితర పూలతోటలతోపాటు వాణిజ్య పంటల విస్తీర్ణాన్ని చేపట్టాలని లక్ష్యాన్ని మార్చి 15లోగా పూర్తిచేయాలని ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 7వేల హెక్టార్లలో డ్రిప్ పరికరాల లక్ష్యానికి గానూ 4వేల హెక్టార్లు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, మిగిలిన 3వేల హెక్టార్ల లక్ష్యాన్ని మార్చి ఆఖరులోగా సాధించాలని ఏపీఎంఐపీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు, ఏపీఎంఐపీ పీడీ సత్యనారాయణ, హార్టికల్చర్ అధికారులు, కంపెనీల యాజమాన్యాలు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 59 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో గురువారం 59 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈవో సునీత తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు నిర్వహించిన పరీక్షల్లో 1201 మంది విద్యార్థులకు గాను 1176మంది హాజరయ్యారని, 25మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి 5గంటల వరకు నిర్వహించిన పరీక్షల్లో 1231 మంది విద్యార్థులకు గాను 1197 మంది విద్యార్థులు హాజరుకాగా 34 మంది గైర్హాజరయ్యారని వివరించారు.

వ్యక్తిపై దాడి.. ముగ్గురిపై కేసు

గడివేముల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వండుట్ల గ్రామానికి చెందిన గణేష్‌రెడ్డిపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీసీ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. వివరాలివీ.. గణేష్‌రెడ్డి, ఆయన తండ్రి గంగాధర్‌రెడ్డి, డ్రైవర్ మధుకుమార్‌నంద్యాల నుంచి వండుట్ల గ్రామానికి కారులో బుధవారం రాత్రి వస్తుండగా పైబోగుల గ్రామానికి చెందిన తిరుపాలు తన ద్విచక్ర వాహనంపై వస్తూ దారి విషయంలో వాగ్వాదానికి దిగాడు. కోపోద్రిక్తుడైన తిరుపాలు, అతడి భార్య మమత, కొడుకు గోవర్ధన్ గురువారం మంచాలకట్ట గ్రామం నుంచి వండుట్లకు వస్తున్న గణేష్‌రెడ్డి, మధుకుమార్‌పై గని గ్రామం వద్ద దాడి చేశారు. ఈ దాడిలో గణేష్‌రెడ్డికి గాయాలయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురికి షోకాజ్ నోటీసులు

గడివేముల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వసతి గృహ వార్డెన్ సునీత మెర్సి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శైలజ, వసతి గృహ హెడ్‌కుక్ విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమంత్‌కుమార్ తెలిపారు. ఈనెల 11న ఉడికీఉడకని చికెన్ తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై విచారణ చేపట్టి ముగ్గురికి షోకాజ్ నోటీసులు ఇచ్చామని చెప్పారు. ఇకపై విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించాలి'

సున్నిపెంట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ హాస్టల్లో మెనూ పెంచాలని, సౌకర్యాలు కల్పించాలని కొమరం భీమ్ ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.ఆశీర్వాదం కోరారు. పీవో వెంకటశివప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని ప్రకాశం, గుంటూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలోని గిరిజన సంక్షేమ హాస్టల్లో సరైన పౌష్టికాహారం అందకపోవడం వల్ల పిల్లలు హాస్టళ్లలో చేరడానికి విముఖత చూపుతున్నారన్నారు.

'జయప్రదం చేయండి'

ఆత్మకూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలోని గుత్తి సమీపంలో గల సేవా ఘాట్ నందు ఈ నెల 13,14,15 తేదీల్లో జరగనున్న చలో సేవాగడ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా నాయకులు రామ్‌బాలాజీనాయక్, రమేష్ నాయక్, బాలా నాయక్, శివశంకర్ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి చేతుల మీదుగా కార్యక్రమ గోడపత్రికలను ఆవిష్కరించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు: డీఎఫ్‌వో

వెలుగోడు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు చిన్నతనం నుంచే ఇష్టంగా చదవాలని నంద్యాల డీఎఫ్‌వో నాగమహేశ్వరి సూచించారు. వేల్పనూరులో ఎస్సీ బాలుర వసతి గృహాన్ని గురువారం ఆమె సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు ఆమె విద్యాకిట్లను అందజేశారు. ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, సీనియర్ సహాయకులు నాగన్న, హాస్టల్ వార్డెన్ రాజు, పంచాయితీ కార్యదర్శి నాగేశ్వరరెడ్డి, గ్రామ నాయకులు శంకర్ రెడ్డి, కాంతారెడ్డి పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ అభివృద్ధికి సహకరించాలి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో ఎమ్మెల్యే దంపతులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కోరారు. బొగ్గు, గనుల శాఖ కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డిని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవ్‌రామ్ దంపతులు ఢిల్లీలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా దివంగత నాయకులు భూమా నాగిరెడ్డి, భూమా శోభానాగిరెడ్డిలతో ఉన్న అనుబంధాన్ని కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి ఎమ్మెల్యే దంపతులతో పంచుకున్నారు. ఆళ్లగడ్డ ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు, నియోజకవర్గ అభివృద్ధికి చేయూతనందిస్తామని, అవసరమైన నిధులు సైతం సమకూరుస్తామని కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సేవలోనే తృప్తి



రామాలయానికి సామగ్రిని అందజేస్తున్న సొసైటీ నిర్వాహకులు

ప్యాపిలి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సొంత ఊరికి సేవ చేయడంలో ఎంతో తృప్తి ఉంటుందని ఎన్ఆర్ రూరల్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంటు సొసైటీ నిర్వాహకులు, న్యాయవాదులు శ్రీనివాసరెడ్డి, నాగభూషణంరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సిద్దనగట్టు గ్రామంలో రామాలయానికి రూ.10వేలు విలువ చేసే సామగ్రి, పేద విద్యార్థికి ల్యాప్‌ట్యాప్ కోసం రూ.10వేలు, పాఠశాలలో విద్యార్థుకు వివిధ సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు జయచంద్రారెడ్డి, అనిత, హేమంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శైలజారెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు క్రీడల్లో రాణించాలి



విద్యార్థినులకు క్రీడా దుస్తులను పంపిణీ చేస్తున్న రాజారెడ్డి

బనగానపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : బాలికలు క్రీడల్లో రాణించాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. గురువారం బాలికలకు సొంత నిధులతో బీసీ రాజారెడ్డి క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సోమశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కుమార్‌బాబు, రామచంద్రరెడ్డి, సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు సురేంద్రరెడ్డి, విద్యాకమిటీ ఛైర్మన్ మహేంద్ర, వైస్ ఛైర్మన్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్యాపిలి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు పార్లమెంటు సభ్యులు పంచలింగాల నాగరాజును గురువారం కర్నూలులోని ఆయన నివాసంలో టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి అలేబాదు పరమేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. 19న అలేబాదులో నిర్వహించే దేవర కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపీని కోరినట్లు పరమేష్ తెలిపారు.

డిగ్రీ కళాశాలలో నాణేల ప్రదర్శన



నాణేల ప్రదర్శనను వీక్షిస్తున్న అధ్యాపకులు

బనగానపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణేల ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్‌గౌస్ మాట్లాడుతూ పురాతన నాణాల ద్వారా చరిత్రను తెలుసుకోవచ్చునని అన్నారు. ఈస్ట్ ఇండియా కంపెనీ జారీ చేసిన నాణేలు, విదేశీ నాణేలు, కరెన్సీ నోట్లు అనేక అరుదైన నాణెల చరిత్రను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకుడు బడేసాహెబ్, అధ్యాపకులు సుధాకర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రామకృష్ణ, రామన్న, సీతమ్మ, కౌసల్యదేవి, వరలక్ష్మి పాల్గొన్నారు.

రైతుల భూసమస్యలు పరిష్కరించండి

రుద్రవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : రీసర్వే గ్రామాల్లో రైతుల భూసమస్యలు పరిష్కరించాలని డివిజనల్ డిప్యూటీ సర్వే అధికారి వెంకటచెన్నయ్య అన్నారు. గురువారం రుద్రవరంలో విలేజీ సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఆయన మాట్లాడుతూ రైతులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. రెండో విడత రీసర్వే నిర్వహిస్తున్న బీరవోలు గ్రామంలో సర్వే పకడ్బందీగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్వేయరు రమణయ్య, విలేజీ సర్వేయర్లు పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన ప్రభుత్వాలు

డోన్ రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రైతులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని సీపీఎం మండల కార్యదర్శి కోయలకొండ నాగరాజు, పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, సీఐటీయు నాయకులు చిన్న రెహిమాన్ ఆరోపించారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. రైతులు తమ పేర్లను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని, లేనిపక్షంలో రైతలకు వచ్చే పథకాలు అందని ప్రభుత్వం చెప్పడం బాధాకరమన్నారు.

యాగంటిలో ప్రత్యేక పూజలు

బనగానపల్లె, ఫిబ్రబరి 13 (ఆంధ్రజ్యోతి) : యాగంటి ఉమామహేశ్వరస్వామిని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి కుమారుడు బీసీ మనోహర్ రెడ్డి గురువారం దర్శించుకున్నారు. యాగంటి బసవయ్యను దర్శించుకొని, ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మాళేశ్వరరెడ్డి తీర్థప్రసాదాలను అందించారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు రామ్‌కో సిమెంట్ కృషి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ వారి ఆదేశాలమేరకు క్షయ వ్యాధి నిర్మూలన కోసం రామ్‌కో సిమెంట్ పరిశ్రమ తనవంతు కృషి చేస్తున్నట్లు పరిశ్రమ యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు వెల్లడించారు. గురువారం మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో ఉచిత క్షయ వ్యాధి వైద్య శిబిరం నిర్వహించారు. 170మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ జయకర్, మైన్స్ డీఎం జియాలజీ నాయుడు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జొన్న ధర పతనం



- క్వింటా రూ.2 వేలు
- భారీగా తగ్గిన దిగుబడులు
- నష్టపోతున్న రైతులు

జొన్నల ధర భారీగా పడిపోయింది. దీంతో రైతులు నష్టాల్లో కూరుకపోతున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడి సగానికి పైగా తగ్గిపోయింది. ఎకరాకు పెట్టుబడి రూ. 30 వేల వరకు పెట్టామని, తీరా పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు లబోదిబోమంటున్నారు. వచ్చిన దిగుబడిని కూడా వ్యాపారులు అడిగిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని అనేక సార్లు కోరినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జొన్న దిగుబడి భారీగా తగ్గింది



14 ఎకరాల్లో జొన్న పంట సాగు చేశా. ఎకరాకు రూ.30 వేలు దాక పెట్టుబడి పెట్టా. తుఫాన్, అకాల వర్షాలు, తెగుళ్ల వల్ల పంట నేలవాలడం, దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. పండిన పంటలో కూడా గింజలు నాసిరకంగా ఉన్నాయని, కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

-మరియమ్మ, మహిళా రైతు, మద్దూరు

తీవ్రంగా నష్టపోయాం



జొన్న సాగు చేసి తీవ్రంగా నష్టపోయాం. గత ఏడాది వచ్చిన దిగుబడి ఈ ఏడాది రాలేదు. ఎకరాకు 12 క్వింటాల్లు కూడా తక్కువే వచ్చాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

వెంకటేశ్వర్లు, రైతు, చందలూరు

చాగలమర్రి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు, బ్రాహ్మణపల్లె, మల్లేవేముల, గొట్లూరు, చిన్నబోదనం, పెద్దబోదనం తదితర గ్రామాల్లో దాదాపు 3 వేల ఎకరాలకు పైగా జొన్న పంట రైతులు సాగు చేశారు. ఎకరానికి దాదాపు రూ.20 వేలు నుంచి రూ.30 వేలు పైగా పెట్టుబడులు పెట్టి పంట సాగు చేశారు. అయితే అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలు, వీచిన ఈదురు గాలులకు పంట నేల వాలిపోయింది. మరో పక్క తెగుళ్ల సోకడం, పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. పంట కాలం పూర్తి కావడంతో రైతులు జొన్న కోతలు ముమ్మరం చేశారు. పండిన జొన్నలను రహదారులు, కలాల్లో ఆరబెట్టారు. గత ఏడాది ఎకరానికి దిగుబడి 20 క్వింటాళ్లు రాగా ఈ ఏడాది 4 నుంచి 8 క్వింటాళ్లకు మించి రావడం లేదు. గత ఏడాది క్వింటా ధర రూ.3,500 పలుకకగా ఈ ఏడాది కేవలం రూ.2 వేలకు ధర పడిపోయింది. ధాన్యం కూడా నాసిరకంగా ఉందని కొనుగోలు దారులు కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు. ఎకరానికి జొన్న పంట సాగు చేయడానికి సేద్యం, పురుగు మందులు, ఎరువులు, కలుపులు, కోతలు అన్ని కలిపితే దాదాపు రూ.30 వేలు పైగా పెట్టుబడులు అయ్యాయి. దిగుబడి చూస్తే ఎకరానికి 8 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. వచ్చిన దిగుబడిని విక్రయిస్తే రూ.16 వేలు మాత్రమే వస్తున్నాయి. దీంతో రైతులు ఎకరానికి రూ.15 వేలు నష్టపోతున్నారు.



కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి జొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రుద్రవరం: రుద్రవరం మండలంలో జొన్నపంట దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరాకు 12 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందన్నారు. ధర కూడా రూ. 2వేలకు మించి పలకడం లేదు. మండలంలో 579 హెక్టార్లలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు జొన్న పంట సాగు చేశారు. ఎకరాకు పెట్టుబడి రూ. 30 వేల వరకు పెట్టామని రైతులు వాపోతున్నారు.

అధిక వర్షాలతో నష్టపోయాం



ఈ ఏడాది జొన్న పంట దిగుబడి భారీగా తగ్గింది. 5 ఎకరాలు కౌలుకు తీసుకొని జొన్న పంట సాగు చేశా. ఎకరానికి రూ.40 వేలు పెట్టుబడి పెట్టా. ఎకరానికి 10 క్వింటాళ్లు కూడా దిగుబడి రాలేదు. ధర చూస్తే రూ.2 వేలు మాత్రమే పలుకుతోంది. జొన్న పంట సాగు చేసి నష్టపోయా. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

- మద్దిలేటమ్మ, మహిళా రైతు, మద్దూరు

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

జొన్నపంట దిగుబడి తగ్గడంతో పాటు మార్కెట్‌లో ధర కూడా లేదు. వ్యాపారులు రూ. 2వేల కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి జొన్నలను కొనుగోలు చేయాలి. లేకుంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

పార్థసారధిరెడ్డి, రైతు

ముగిసిన బండలాగుడు పోటీలు



బండలాగుతున్న ఎద్దులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెహిమాన్‌పురం గ్రామంలో కాశీ విశాలాక్షి, విశ్వేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవంలో భాగంగా నిర్వహించిన బండలాగుడు పోటీలు గురువారం ముగిశాయి. పోటీల్లో కర్నూలు జిల్లా వెంకటగిరికి చెందిన ఎల్‌కే బుల్స్ శశాంక్ శ్రేయ ఎద్దులు 4194 అడుగుల దూరం లాగి మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. అలాగే రెండో విజేతగా బేతంచెర్ల బానుజా ఎద్దులు 3843 అడుగుల దూరం లాగి రెండో విజేతగా, దొర్నిపాడు, కడపజిల్లా దాసరపల్లె దేవరాజనాయుడు ఎద్దులు 3791 అడుగలు లాగి మూడో విజేతగా నిలిచాయి. కొత్తపల్లి, మరియు కడపజిల్లా దాసరపల్లె ప్రతాప్ యాదవ్ ఎద్దులు 3764 అడుగులు లాగి 5వ విజేతగా నిలిచింది. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి ఎద్దులు 3750 అడుగులు లాగి 6వ విజేతగా, నంద్యాల ఇసుకపల్లె సిద్దయ్య ఎద్దులు 3387 అడుగులు లాగి 7వ విజేతగా నిలిచింది. విజేతలకు టీడీపీ నాయకురాలు బుగ్గన్న ప్రసన్నలక్ష్మి, రహిమాన్‌పురం టీడీపీ నాయకులు మధుయాదవ్, భరత్ రెడ్డి, బాలకృష్ణలు బహుమతులు ప్రదానం చేశారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

దొర్నిపాడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ హనుమంతరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అమ్మిరెడ్డినగర్ గ్రామంలో కస్తూర్బా గురుకుల పాఠశాలను సందర్శించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థినులు బాగా చదివి తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకొని రావాలని సూచించారు. నేటి మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు. అనంతరం పాఠశాలలో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఏవైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

అవుకు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : అవుకు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సీహెచ్‌ఓ పర్హాన్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రతి గురు, శని వారాల్లో బీపీ, హిమోగ్లోబిన్, ఎత్తు, బరువు, ఛాతి కొలతలు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అనారోగ్యానికి గురైన విద్యార్థులను గుర్తించి డాక్టర్ల సూచనల మేరకు మందులను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త దానమ్మ, ఆశా కార్యకర్తలు కుళాయమ్మ, వెంకటేశ్వరమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

ప్రారంభమైన టెక్కెస్వామి ఉరుసు

అవుకు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కునుకుంట్ల గ్రామ సమీపంలో వెలసిన టెక్కెస్వామి ఉరుసు వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. దర్గాను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కునుకుంట్ల గ్రామ టీడీపీ నాయకులు గూడాల శివరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గంధం వేడుకలను నిర్వహించారు. రాత్రి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

యూరియా కోసం రైతుల ఆందోళన



మన గ్రోమోర్ వద్ద యూరియా కోసం గుమ్మిగూడిన రైతులు

చాగలమర్రి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో యూరియా కొరత అధికంగా ఉండటంతో రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని మన గ్రోమోర్ వద్ద యూరియా ఇవ్వాలంటూ రైతులు ఆందోళన చేపట్టారు. మన గ్రోమోర్ కేంద్రానికి కేవలం ఒక్క లారీ యూరియా రావడంతో రైతులు ఎగబడ్డారు. ప్రస్తుత సీజన్‌లో యూరియా అవసరం ఎక్కువగా ఉండటంతో మనగ్రోమోర్ వద్ద రైతులు అధిక సంఖ్యలో తరలిరావడంతో కిక్కిరిసిపోయింది. రైతుల ఆందోళనతో మన గ్రోమోర్ తలుపులు మూసి వేసే పరిస్థితి నెలకొంది. ఎరువుల దుకాణదారులు యూరియా కొరతను సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడంతో కష్టాలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. బ్లాక్‌లో విక్రయిస్తున్నా వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

నేడు సంజామలకు మంత్రి రాక

సంజామల, ఫిబ్రవరి 13: మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి శుక్రవారం ఉదయం సంజామలకు వస్తున్నట్లు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పెండేకంటి కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. ముదిగేడు నుండి సంజామలకు నూతనంగా ఏర్పాటు చేయనున్న డబుల్ రోడ్డు నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేస్తారన్నారు. రూ. 12.58 కోట్లతో నియమించనున్న సీసీ డబుల్ రోడ్డు పనులను మంత్రి ప్రారంభిస్తారని ఆయన వెల్లడించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న పూదోట మఠం నిర్వాహకులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గౌరిపేటలోని ఉన్న పూదోట మఠం నిర్వాహకులు పేద మహిళలు తలారీ నాగలక్ష్మి జీవనోపాధి కోసం కుట్టుమిషన్‌ను గురువారం అందజేశారు. గుండా గోపాల్ మాట్లాడుతూ సమాజంలో పేద ప్రజలను ఆదుకోవడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పూదోట మఠం నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

సరోజినీ నాయుడు సేవలు చిరస్మరణీయం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : స్వతంత్ర భారత తొలి మహిళా గవర్నర్ సరోజినీ నాయుడు సేవలు చిరస్మరణీయమని ప్రైవేట్ పాఠశాలల ఆళ్లగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడు అమీర్ బాషా అన్నారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పాలసాగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో సరోజినీ నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి గురువారం నివాళి అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మురళీధర్, ఉపాధ్యాయులు నాగరాజు, స్వర్ణ, సుందరమ్మ, పద్మావతమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులు ఈశ్రామ్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోండి

దొర్నిపాడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈశ్రామ్ పోర్టల్‌ను ఉచితంగా అసంఘటిత కార్మికులు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో సావిత్రి అన్నారు. ఆమె మాట్లాడుతూ ఈశ్రామ్ పోర్టల్ ద్వారా ప్రతి అసంఘటిత కార్మికుడికి 12 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డు ఇస్తామని అన్నారు. చిన్న, సన్నకారు రైతులు పాడి పరిశ్రమ, వ్యవసాయ, నర్సరీలు, మత్స్యకారులు, భవన, అనుబంధ రంగాల్లో పని చేసే వారు అర్హులని అన్నారు.

డోన్ సాయిబాబా ఆలయంలో పూజలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : డోన్ పట్టణంలోని సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకల్లో టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి గురువారం పాల్గొన్నారు. సాయిబాబా ఆలయంలో ఆయన విశేష పూజలు నిర్వహించారు.

పేదల సంక్షేమమే కూటమి లక్ష్యం



మాట్లాడుతున్న అభిరుచి మధు

చాగలమర్రి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు తెలిపారు. గురువారం చాగలమర్రి గ్రామంలో బీజేపీ మండల కమిటీ ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించి బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. అనంతరం నూతన బీజేపీ మండల అధ్యక్షుడి గా చంద్రమౌళిని ఏకగ్రీవంగా ఎన్నుకొని సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగన్న, నియోజకవర్గ యువమోర్చ ప్రచార కార్యదర్శి రామకృష్ణ, సుదర్శన్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోట్ల ఇంటికి మంత్రి బీసీ



ఎమ్మెల్యే కోట్లతో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

డోన్ రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఇంటికి రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి గురువారం వచ్చారు. కోట్ల నివాసంలో ఎమ్మెల్యే కోట్ల, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. కోట్ల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో వారు హాజరయ్యారు.

వైభవంగా దీపోత్సవం



పాత శివాలయంలో దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

చాగలమర్రి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయం, కొత్తపల్లె గ్రామంలోని రామాలయంలో మాఘపౌర్ణమి సందర్భంగా మహిళలు సామూహికంగా దీపాలు వెలిగించి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శివస్వాములు ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. భైరవగుండాల క్షేత్రంలో శివపార్వతుల పల్లకి ఉత్సవం నిర్వహించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

చాగలమర్రి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో రంగనేతాజీ తెలిపారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని మూడో ఆర్‌బీకే కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన గుర్తింపు సంఖ్య గురించి వివరించారు. రైతు సేవా కేంద్రాల్లో గుర్తింపు సంఖ్యను పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో మంజుల, ఫరూక్, వీహెచ్‌ఏ సుబ్బరాయుడు, రైతులు పాల్గొన్నారు.

ఆదివాసులను ఎన్‌కౌంటర్ చేయడం దారుణం

డోన్ టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆదివాసులను రాజ్యాంగానికి విరుద్ధంగా మావోయిస్టుల పేరుతో ఎన్‌కౌంటర్ చేయడం దారుణమని ఐఎఫ్‌టీయూ నాయకులు ప్రధాన కార్యదర్శి రంగనాయకులు ఆరోపించారు. గురువారం పట్టణంలోని ఇందిరానగర్‌లో ఆదివాసులపై మరణకాండ ఆపాలని నిరసన తెలిపారు. కార్యక్రమంలో దొరపల్లెరాజు, లక్ష్మన్న, చందు, శ్రీరాములు, మధు పాల్గొన్నారు.

2,500 క్యూసెక్కుల నీరు విడుదల



నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న టీజీపీ ఎస్ఈ శివప్రసాద్‌రెడి

చాగలమర్రి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి టీజీపీ ప్రధాన కాలువకు 2,500 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు తెలుగుగంగ సూపరింటెండింగ్ ఇంజనీర్ శివప్రసాదురెడ్డి తెలిపారు. గురువారం రుద్రవరం, చాగలమర్రి, ఆళ్లగడ్డ పరిధిలోని 28, 29 బ్లాక్‌చానల్ సమీపంలోగల టీజీపీ కాలువలో ప్రవహిస్తున్న నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని అన్నారు. తుండ్లవాగు రిజర్వాయర్‌కు 800 క్యూసెక్కుల నీరు చేరుతుందని అన్నారు. వీబీఆర్ నీటి సామర్థ్యం 18.95 టీఎంసీలకు గాను ప్రస్తుతం 8.6 టీఎంసీల నీటి నిల్వ ఉందని అన్నారు. వారాబందీ ద్వారా కాలువకు నీరు విడుదల చేస్తామని అన్నారు. ఆయన వెంట టీజీపీ ఈఈ శివశంకర్ రెడ్డి, డీఈలు వెంకటరమణ, రత్నరాజు, గురుమూర్తి, అనిల్‌కుమార్ రెడ్డి, ఏఈలు మోహనకృష్ణారెడ్డి, వినయ్‌కుమార్, నాయక్ పాల్గొన్నారు.